


రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.24 బుధవారం సాయంత్రం
సహరి: 4.41 గురువారం ఉదయం

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆదాయం
రూ.26,48,813 7

కోరివారి అగ్రహారంలో సినిమా షూటింగ్ సందడి
» మంచి కథతోనే నటుడికి గుర్తింపు
» ప్రముఖ హాస్యనటుడు జెన్నీ 6

28 నుంచి చింతలూరు నూకాంబిక జాతర ప్రారంభం 6

## ఏటిగట్టు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల అభివృద్ధికి రూ.14.36కోట్లు మంజూరు

» ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

పి.గన్నవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాజోలు హెడ్‌వర్క్స్ సబ్‌డివిజన్ పరిధిలోని ఏటిగట్టు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు అభివృద్ధి నిమిత్తం వరద నియంత్రణ ప్రాజెక్టులకు రూ.14.36కోట్ల నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ తెలిపారు. వైన తేయ ఎడమగట్టు పరిధిలో అవుట్‌ఫాల్‌స్లూయిజ్‌లకు జరిగిన మరమ్మతుల పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నాగుల్లంక, మానేపల్లి, పాశర్లపూడి గ్రామాల్లో 16కిలోమీ టర్ల మేర ఏటిగట్టు అభివృద్ధికి రూ.96లక్షలు మంజూరయ్యాయన్నారు. కుడిగట్టు మామిడికుదురు మండలంలోని మైనర్ డ్రైన్‌ల్లో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ పరిధిలోని వశిష్ఠ ఏడమ గట్టు రాళ్లవలస అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ఆధునికీకరణకు రూ.13.40కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. పెద్దతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్ మరమ్మతుల నిమిత్తం కలెక్టర్ రూ.30లక్షలు కేటాయించారని తెలిపారు.

కోనసీమ జిల్లాపై..

# కలెక్టర్ ‘నివేదిక’



కలెక్టర్ల సదస్సుకు హాజరైన కలెక్టర్ మహేష్‌కుమార్

» నేడు కలెక్టర్ల కాన్ఫరెన్సులో జిల్లా నివేదికను వివరించనున్న కలెక్టర్
» ఏటిగట్లు,అవుట్‌ఫాల్‌స్లూయిస్‌ల అభివృద్ధికి రూ.9.4కోట్లు కేటాయించాలి
» ఇసుక ఎద్దడి లేకుండా చర్యలు
» కలెక్టర్ మహేష్‌కుమార్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండురోజులపాటు జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్సు మంగళవారం ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఈ సమావేశానికి హాజరయ్యారు. జిల్లాలో ప్రభుత్వపరంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు వాటి వృద్ధిని వివరిస్తూ ఒక నివేదికను బుధవారం జరిగే సమావేశంలో ముఖ్యమంత్రికి నివేదించనున్నారు.2026 వరకు చేపట్టే పనులు, వాటి వృద్ధితోపాటు వాటి అమలుకు అయ్యే నిధుల విడుదల కోరుతూ ప్రభుత్వానికి కలెక్టర్ నివేదించనున్నారు.దీనిలో భాగంగా జిల్లాకు సంబంధించిన నివేదికలోని ముఖ్య సారాంశాలిలా ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ కలెక్టర్ ఇచ్చిన నివేదికలో కీలక అంశాలు ఇలా ఉన్నాయి.

### 20లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు

- జిల్లాలో ఎంటీయూ 1232 వరి వంగడాన్ని 40 ఎకరాల్లో సాగు చేసేందుకు ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాలను ఎంపిక చేశారు. ఏరియా విస్తరణ పథకం కింద 3200 ఎకరాల నుంచి 6500 ఎకరాలకు పెంచాలని నిర్ణయించారు.
- అరటితోటలు 1300 ఎకరాలు, బొప్పాయి 115 ఎకరాలు, కూరగాయలు, పువ్వులు 240 ఎకరాలు, కోకో వెయ్యి ఎకరాలు, ఆయిల్ పామ్ 500 ఎకరాలు, ఇతర పంటలు 40ఎకరాలు మొత్తం కలిపి 3195 ఎకరాల్లో పంటల విస్తరణ చేపట్టనున్నారు.
- క్రమబద్ధీకరించిన వీర్యం ద్వారా 8వేల గేదెలకు కృత్రిమ గర్భాధారణ
- 280 హెకార్టర్లలో అడవుల అభివృద్ధి
- వంద కిలోమీటర్ల పరిధిలో 330 హెకార్టర్లలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధి.
- 2018 ప్రొటెన్షియల్ ఆక్వాకల్చర్ ప్రాంతం రీసర్వే ప్రకారం ఆక్వాజోన్ వెలుపల ఉన్న 18724 ఎకరాలు ఆక్వాజోన్‌లో చేర్చాలి. 6,806 ఎకరాలు ప్రొటెన్షియల్ ఆక్వాకల్చర్ ప్రాంతాన్ని ఆక్వాజోన్‌లో చేరుస్తారు.
- ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో భాగంగా రానున్న వర్షాకాలంలో వినియోగించుకోవడానికి 20లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను లక్ష్యంగా నిర్ధారించారు. నిర్మాణ పనులకు ఇసుక నిరంతరాయంగా సరఫరా చేయడమే ముఖ్య ఉద్దేశం.
- క్వాయర్ ఆధారిత జియో వస్త్రాల ఉత్పత్తి చేపట్టాలి.
- జిల్లాలో జియో టెక్స్‌టైల్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.
- అయినవిల్లివద్ద 400కేవీ సబ్‌స్టేషన్ 22.50 కిలోమీటర్ల పరిధిలో పూర్తిగా పనిచేస్తుంది.
- రూ.100 కోట్లతో మెటీరియల్ కాంపోనెంట్ పనులు అమలు చేయాలి.
- కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు. 402ఎకరాల విస్తీర్ణంలో 24 కిలోమీటర్లకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయనున్నాం. మిగిలిన ప్రాంతాల్లో రైల్వేలైన్‌కోసం భూసేకరణ చేపట్టాలి.
- ఆప్తాకి ఐదెకరాల భూమిని గుర్తించి కేటాయించాలి.
- జిల్లాలోని అన్ని గ్రామాలను డిజిటల్‌గా చేయాలన్నది లక్ష్యం.
- వివిధ రంగాల కింద కేటాయించిన మొత్తం క్రెడిట్ లక్ష్యం రూ.18,019 కోట్లు

**ఈ నిధులు విడుదల చేయాలి..**

- జిల్లాలో వరద కరకట్లు, అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు, కల్వర్టర్లు, లాకులు అభివృద్ధికి తక్షణంగా రూ.9.4కోట్లను సాయంఅందించాలి.
- వ్యవసాయ రంగంలో బెయిలింగ్‌మెకనైజ్డ్ మిషన్‌స్కీమ్‌లో భాగంగా ఒక్కోయూనిట్‌కు రూ.3.5లక్షలు వంతు సాయం అందించాలి.
- ముమ్మిడివరంలోని ఎయిమ్స్‌కళాశాలలో ప్రభుత్వకార్యాలయాల భవనాల సముదాయానికి సంబంధించి లీజుగా 2022 నుంచి మార్చి 2025 వరకు మూడేళ్లకాలానికి రూ.5.11కోట్లను అద్దె బకాయిలు విడుదల చేయాలని కోరారు.

- 10వేల మందికి గృహనిర్మాణ రుణ గ్రహీతలకు ప్రయోజనం చేకూరేందుకు రూ.304 కోట్లతో ఇళ్ల నిర్మాణాలు.
- టూరిజం అభివృద్ధిపై డీపీఆర్ తయారీలో నిమగ్నం.
- ఆధ్యాత్మిక పర్యాటకం, ఎకోటూరిజం అభివృద్ధికి చర్యలు.
- పచ్చని కోనసీమలో సహజసిద్ధ వరిపొలాలు, బీచ్‌లు, బ్యాక్ వాటర్‌స్టోరేజ్ ఉన్న ప్రాంతాలను అన్వేషించి వాటి అభివృద్ధికి చర్యలు.
- ముమ్మిడివరంలో ఎంపీపీఎస్ గోడౌన్, ఉప్పలగుప్తంలో మార్కెట్ గొడౌన్‌లు నిర్మాణంలో ఉన్నాయి.
- జిల్లాలోని పంచాయతీలను డిజిటల్‌గా అభివృద్ధి చేసేందుకు 4జీ టవర్ల నిర్మాణం.
- జిల్లా డీవీటీస్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు

ఇలా జిల్లా అభివృద్ధికి సంబంధించి కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం జరిగే కాన్ఫరెన్స్‌లో సీఎంకు నివేదికను సమర్పించనున్నారు.

## ఖరీఫ్ ధాన్యం సేకరణలో జిల్లాకు ప్రథమస్థానం

» కలెక్టరేట్‌లో విజయోత్సవ సభ
» ఉత్తమ సేవలందించిన సిబ్బందిని సత్కరించిన జేసీ



జిల్లా వ్యవసాయాధికారిని సన్మానిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతంచేసిన సిబ్బంది ఉత్తమ సేవలను గుర్తించి జేసీ టి.నిషాంతి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేసి సత్కరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ అధ్యక్షతన విజయోత్సవ సభ నిర్వహించారు. జిల్లాలో 2024-25 ఖరీఫ్‌ధాన్యాన్ని 371 ఆర్ఎస్కేఎస్ కేంద్రాల ద్వారా 2,27,415 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 39,180మంది రైతులనుంచి సేకరించామన్నారు. కృష్ణాజిల్లా రైతులనుంచి 6,090 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.523కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు 48గంటల్లోపే జమ చేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాలసరస్వతి, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, డీసీవో ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.





అధికారులు తమకు క్షమాపణ చెప్పాలని ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్నరైతులు, కూటమి నాయకులు

## సాగునీటి తగాదా

» రైతులు, అధికారుల మధ్య వివాదం
» ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా
» తహసీల్దార్ కార్యాలయంలో ఫలించిన చర్చలు
» 300క్యూసెక్కుల నీరు విడుదలకు ఎస్ఈ అంగీకారం

ఉప్పలగుప్తం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తమ దాళ్వా పంటను కాపాడుకునేందుకు రైతులు రోడ్డెక్కారు. ఇరిగేషన్ అధికారులతో తగాదా పెట్టుకున్నారు. స్టేషన్‌కు రావాలని ఒక రైతుకు ముమ్మిడివరం పోలీసులనుంచి ఫోన్ రావడంతో పెద్ద రాద్ధాంతమే జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పలగుప్తం శివారు ఆయకట్టు భూములకు నీటి కోసం స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు మోటూరి రవికుమార్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం అయినాపురం వెళ్లి ఏఈని కలిశారు. వంతు కాని సమయంలో లాకుల తలుపులు ఎంతో కొంత పైకి ఉండాలి కదా అని నిలదీశారు. అనంతరం ఏఈ సూచన మేరకు అన్నంపల్లి వెళ్లారు. కాగా వెంటనే రావాలంటూ ముమ్మిడివరం పోలీసులనుంచి పేరాయిచెరువుకు చెందిన ఒక రైతుకు కాల్ రావడంతో మంగళవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రైతులు బైఠాయించి ఇరిగేషన్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు వచ్చి తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులపై ఎటువంటి కేసు నమోదు కాలేదని స్థానిక ఎస్ఐ సీహెచ్ రాజేష్ ఎంత చెప్పినా వినకుండా ఆందోళన కొనసాగించారు. తహసీల్దార్ వాసా శామ్యూల్‌దివాకర్ రైతు నాయకులతో చర్చించినా ససేమిరా అన్నారు. ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు రావడంతో ఆందోళనను తహసీల్దార్ కార్యాలయానికి మార్చారు. అక్కడ రైతులకు, ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్, ఈఈ బి.శ్రీనివాసరావు, ఏఈ ఎస్.పవన్‌లతో తహసీల్దార్ దివాకర్, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ చర్చలు జరిపారు. అన్నంపల్లిలో రైతులు తమను దుర్భాషలాడుతుంటే రక్షణ నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఈ వివరించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వలేదన్నారు.ఇరిగేషన్ అధికారులు తమకు క్షమాపణ చెప్పాల్సిందేనని రైతులు పట్టుబట్టారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో సీఐ ప్రశాంత్‌కుమార్ రైతులతో మాట్లాడారు. పట్టుదలకు పోకుండా పంటను రక్షించుకునే మార్గం చూసుకోవాలని నచ్చజెప్పారు. దీనితో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పదిరోజులు నిరాటంకంగా 300క్యూసెక్కులనీటి విడుదలకు ఎస్ఈ అంగీకరించడంతో రైతులు శాంతించారు. ఉప్పలగుప్తం డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, వైస్‌చైర్మన్ గుత్తుల శ్రీనివాస్, నీటి సంఘాల అధ్యక్షులు నల్లా సత్యనారాయణ, మోటూరి రవికుమార్, పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, రైతు నాయకులు అరిగెల నానాజీ, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, చిక్కం పెద్దబ్బులు, చిక్కం భీముడు, అడబాల సత్యనారాయణ, రవణం మధు, పెయ్యల దుర్గారావు, మధుర నరసింహమూరి పాల్గొన్నారు.

## రెవెన్యూ రికార్డుల నిర్వహణలో.. జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి: జేసీ

అమలాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భూపరిపాలనా వ్యవహారాలు చూసే అతి ముఖ్యమైన రెవెన్యూ వ్యవస్థలో జవాబుదారీతనంతో పనిచేయాలని జేసీ టి.నిషాంతి అన్నారు. నిబద్ధతతో పనిచేస్తూ రెవెన్యూ రికార్డుల నిర్వహణలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ ఉద్యోగులతో జేసీ సమావేశం నిర్వహించారు. భూపరిపాలనా అంశాల ఫైలింగ్ నిర్వహణ, విధి విధానాలపట్ల పరిపూర్ణమైన అవగాహనను రెవెన్యూ సిబ్బందికి ఆమె కల్పించారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను జోడిస్తూ పారదర్శకంగా నివేదికలు తయారు చేయాలన్నారు. గ్రామస్థాయి వీఆర్వో నుంచి కలెక్టరేట్ వదరకు రెవెన్యూ సంబంధిత నివేదికలు సకాలంలో స్పష్టతతో రికార్డులు రూపొందించి సమర్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో భూసమస్యలపై విచారణజరిపి సమగ్ర నివేదికను కలెక్టరేట్‌కుఅందించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సమన్వయం తో భూపరిపాలన, ఎన్నికల నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కారం అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని మెరుగైన సేవలను అందించాలన్నారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు శివరాజ్, రమణకుమారి, ఉప తహశీల్దార్లు వంశీ, ఏసుబాబు, భరత్ పాల్గొన్నారు.

# కూటమిలోనూ.. కదలికేది!



రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాల నిర్మాణం ఇలా...

» మెడికల్ విద్య..మిథ్య
» తూర్పున కళాశాల ఆరంభం
» వసతులు చూస్తే అరకొరే
» కోనసీమలో భవనాలే లేవు
» నేటికీ పునాది దాటని వైనం
» నాలుగేళ్లయినా నేటికీ ఇంతే
» వైసీపీ నిర్వాకం..సాగని పనులు
» 10 నెలలైనా పట్టని కూటమి
» మెడికల్ విద్యార్థుల ఇక్కట్లు

**నాడు అంతన్నారు.. ఇంతన్నారు.. పూర్తిచేయకుండా వదిలేశారు.. నాలుగేళ్లయ్యింది.. నేటికీ నిర్మాణంలోనే ఉన్నాయి.. ఇదీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలల తీరు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో అయితే భవన నిర్మాణాలు పూర్తికాకుండానే తరగతులు ప్రారంభించేశారు.. సౌకర్యాలు చూస్తే అరకొరే.. విద్యార్థులకు ఇబ్బందే.. అయినా పట్టించుకునేవారే లేరు.. కన్నెత్తి చూసేవారు కానరావడంలేదు.. ఇక అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అయితే నేటికీ భవన నిర్మాణాలు పునాది దశనూ దాటలేదు.. కాకినాడ జిల్లా రంగరాయ మెడికల్ కళాశాలలోనూ నేటికీ సమస్యలు వెన్నాడుతు న్నాయి.. గత ప్రభుత్వంలో సరే సరి.. కూటమి ప్రభుత్వంలోనూ కదలికలేకపోవడంపై ‘ఆంధ్రజ్యోతి’ ఫోకస్..**

## మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు నత్తనడక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఆర్భాటాలకే కానీ.. వాస్తవ రూపంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించక పోవడం వల్ల మెడికల్ కాలేజీ, కొత్త ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. కూటమిలోనైనా వేగం పుంజుకున్నాయా అంటే అదీ లేదు. సమస్య ఏమిటో కానీ నాడు పనులు ఎలా ఉన్నాయో నేటికీ అలాగే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నా కాంట్రాక్టర్లు వేగంగా పనిచేయడం లేదనే అక్కడిఅధికారులే చెప్పడం గమనార్హం. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలో రూ.475కోట్లతో మెడికల్ కాలేజీ, ఆసుపత్రి భవనాలు నిర్మించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ రూ.100 కోట్ల పని మాత్రమే జరిగింది. ఏడాదికి 150 మంది విద్యార్థులతో నడుస్తున్న ఈ కాలేజీలో ప్రస్తుతం రెండో బ్యాచ్ నడుస్తోం ది. సెప్టెంబర్‌కు మూడో బ్యాచ్ వస్తుంది.ప్రతిఏడాది 150సీట్లలో 110నుంచి 120వరకూ అమ్మాయిలే చేరడం గమనార్హం. వారు ఇంత వరకూ హాస్టల్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం బాలికలు 360మందికి, బాలురు 120మందికి సరిపడా హాస్టల్ కట్టారు. కానీ ఇవి ఇంకా పూర్తిగా అందుబాటులోకి లేదు. కాలేజీ భవనం పూర్తి కాలేదు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు క్లాసులు పీఈడీ(నర్సింగ్ విద్యార్థులకు నిర్మించిన) భవనంలో జరుగుతున్నాయి. మూడో బ్యాచ్ సెప్టెంబరులో రానుంది. అప్పటికి కొత్త కాలేజీ భవనం నిర్మాణం కాకపోతే ఇబ్బందే.కొత్త కాలేజీ భవనంలో 17 శ్లాబ్‌లకు 15 పూర్తి చేశారు.ఇంకా రెండు పూర్తి చేయాలి. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.ఇక్కడ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 500 పడకల కొత్త బోధనాసుపత్రి నిర్మించాల్సి ఉంది.దానికి భూమిని సిద్ధం చేసినా కదలిక లేదు. ఇప్పటికే పేషెంట్ల సంఖ్య పెరిగిందని, పుష్కరాల నాటికి బాగా పెరుగుతుందని, అప్పటికి కొత్త ఆస్పత్రి అందుబాటులోకి రావాలని ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభుత్వానికి లేఖ రాశారు. గత వైసీపీ అసలు కొత్తభవనం గురించి పట్టించుకోలేదు. కూటమి వచ్చిన తర్వాత పాత భవనాలు తొలగించి స్థలాన్ని సిద్ధం చేసినా పనులు ఆరంభంకాలేదు.



కోనసీమలో ఆగిపోయిన మెడికల్ కళాశాల భవనం పనులు

## కోనసీమలో ఆగిపోయిన పనులు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నాలుగేళ్లు కావొస్తున్నా ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు పునాదుల దశలను దాటలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణలోనే పునాదుల్లో ఉన్న భవనాలు, నిర్మాణ సామగ్రి ఉన్నాయి. వందల కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల భవనాల్లో కొన్ని శ్లాబ్‌ల దశలకు చేరుకున్నాయి. ప్రధాన వైద్య కళాశాల భవనం పునాదుల స్థాయికి మాత్రమే పరిమితమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి కూతవేటు దూరం సమనస గ్రామంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మే 31న అప్పటి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాటి నుంచి వైద్య కళాశాల నిర్మాణ పనుల ప్రగతి ‘మిథ్య’గా మారింది. 56 ఎకరాల్లో రూ.475 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 32 భవనాలు నిర్మించాల్సి ఉన్నా ప్రస్తుతం 17 భవనాలు వివిధ దశల్లో మాత్రమే నిర్మించడానికి కాంట్రాక్టు సంస్థ అయిన మెగా ఇంజనీరింగ్ చర్యలు చేపట్టింది. ప్రధానమైన 750 పడకల ఆస్పత్రి కీలక భవనంతో పాటు ఆరు బ్లాకులతో వైద్య కళాశాల భవనాలు శ్లాబ్‌ల దశకు చేరుకున్నాయి. మిగిలిన బాయ్స్, లేడీస్ హాస్టల్స్ భవనాలు కొన్ని శ్లాబ్‌లు పూర్తయ్యాయి. వివిధ రకాల ల్యాబ్‌లు నిర్మాణ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ఈ వైద్య కళాశాల నిర్మాణ పనులు వచ్చే నెల ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నాడు వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాంట్రాక్టు సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే పనులు నత్తనడకన జరగానికి కారణమని సమాచారం. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు కావొస్తున్నా వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిపై ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం కళాశాల నిర్మాణ పనుల్లో కీలక పాత్ర వహించిన మెగా సంస్థ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలు, ఇతర సామగ్రిని ఖాళీ చేసి వెళ్లిపోయినట్టు సమాచారం. మరి ఈ కళాశాల భవనాల నిర్మాణాలు మళ్లీ పునః ప్రారంభమయ్యేది ఎప్పుడో వేచి చూడాల్సిందే.



కోనసీమలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న ఐరన్

## పి-4 పేరుతో ప్రజల్ని యాచకులుగా మార్చొద్దు

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
» ప్రజాచైతన్య సైకిల్ యాత్ర ప్రారంభం

అమలాపురంటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి పి-4 పథకాన్ని అమలు చేయనున్నట్టు ప్రకటించిందని, పి-4 పేరుతో ప్రజలను యాచకులుగా మార్చవద్దని హితవు పలికారు.అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారంనుంచి చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఈనెల 28 వరకు జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవ సభలో శ్రీనివాసరావుతోపాటు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) మాట్లాడారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేవని, నిరుద్యోగ భృతి లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలనెలా ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. జిల్లాలో భూస్వాముల అధీనంలో ఉన్న లక్షలాది కొబ్బరిచెట్లను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. అనంతరం గడియారస్తంభం సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలువేసి సైకిల్ యాత్రను ప్రారంభించారు. బుద్ధవిహార్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీ వడ్డెర కాలనీకి చేరుకుంది. ఈదరపల్లి వంతెన వద్ద పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించి నిర్వాహకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బండారులంకలో చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ కూలీలతో మమేకమై వారి సమస్యలు అడిగారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరామ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంద్ర మాల్యాద్రి, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, డీవీ రాఘవులు పాల్గొన్నారు.



సైకిల్ యాత్రలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఐవీ

# కోరివారి అగ్రహారంలో సినిమా షూటింగ్ సందడి

అంబాజీపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం మాచవరం పరిధి కోరి వారి అగ్రహారం మేడిది సత్తిరాజు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం బంగారు మురుగు సినిమా షూటింగ్ జరిగింది. ముత్యాలపల్లికి బ్యానర్‌పై ప్రఖ్యాత చిత్రకారుడు కూచి, ఆర్ట్ డైరెక్టర్ బ్నిం పర్యవేక్షణలో రమణ రచయితగా, డొక్కా ఫణి దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఇందులో తనికెళ్ల భరణి, ఐడ్రీమ్ అంజలి, ప్రదీప్, సరస్వతి, జెన్నీ, రత్నసాగర్ నటిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఫణీంద్ర గొల్లపల్లి తెలిపారు. 1969 నుంచి 1980 వరకు బామ్మ, మనవడి మధ్య జరిగే సన్నివేశాలను ఈ చిత్రంలో తెరకెక్కిస్తున్నారు. బామ్మ పాత్రలో రత్నసాగర్ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. హీరో, హీరోయిన్‌గా కొత్తవారిని పరిచయం చేస్తున్నట్టు చెప్పారు. పార్థు నిమాని మ్యూజిక్ డైరెక్టర్‌గా, ప్రముఖ గాయకురాలు చిత్ర రెండు పాటలు పాడారన్నారు. రెండువారాల కోనసీమ ప్రాంతంలో షూటింగ్ ఉంటుందన్నారు.



ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

## మంచి కథతోనే నటుడికి గుర్తింపు



● ప్రముఖ హాస్యనటుడు జెన్నీ

నాటకం, సినిమాలోని మంచి కథతోనే నటుడికి తగిన గుర్తింపు వస్తుందని ప్రముఖ హాస్యనటుడు జెన్నీ అన్నారు. షూటింగ్‌లో భాగంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మాది కోనసీమ జిల్లాలోని ఆలమూరు. హైదరాబాద్‌లోని ఈసీఎల్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేశా. నాటకాలపై ఉన్న మక్కువతో సినిమారంగంలోకి వచ్చా. 1986లో జంధ్యాల సినిమాలో తొలి అవకాశం లభించింది. ఇప్పటివరకు 400 సీరియల్స్, 300 సినిమాల్లో నటించాను. ఎండమావులు, లేడీడిటెక్టర్, అంతరంగాలు సీరియల్స్ మంచి గుర్తింపు తెచ్చాయి. దాదాపు 80 కథలు రాయగా, అందులో 30 కథలకు ప్రత్యేక బహుమతులు అందుకున్నా.

## 1960లో సినిమా ఇండస్ట్రీకి వచ్చా

● సీనియర్ నటి రత్నసాగర్



1960లో సినీ ఇండస్ట్రీకి వచ్చా. ఇప్పటి వరకు 250 సినిమాలు, మూడవేలకు పైగా సీరియల్స్ లో నటించా. కారాలు - మిరియాలు సినిమాకు నంది అవార్డు లభించింది. ముగ్గురు మొనగాళ్లు, లక్ష్మీనరసింహ, ముద్దుల ప్రియుడు చిత్రాలు మంచి గుర్తింపును తెచ్చాయి. కోనసీమ అందాలు మరువలేను, ఈ ప్రాంత వాసులు చూపే ఆప్యాయత, అనుబంధాలు మరిచిపోలేనివి.

# చల్లంగ చూడమ్మా..!

● 28 నుంచి చింతలూరు నూకాంబిక జాతర ప్రారంభం
● ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత
● ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు
● లక్షలాదిగా తరలిరానున్న ఉభయ గోదావరి జిల్లాల భక్తులు

ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో పేరుగాంచిన ప్రధాన జాతరలో ఆలమూరు మండలం చింతలూరు నూకాంబిక జాతర ఒకటి. ఈనెల 28 నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో 28న జాతర మహోత్సవం, 29న తీర్థం, 30న ఉగాది ఉత్సవాలతోపాటు మొత్తం నెలరోజల పాటు జాతర జరగనుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను సేవాకమిటీలు ఇప్పటికే ఏర్పాటు చేశాయి. లక్షలాది మంది తరలిరానున్న ఈ జాతరను సమర్థవంతంగా నిర్వహించాలని పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్షలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. చంటిపిల్లల దేవతగా కొలిచే అమ్మవారికి జాతర ఉత్సవాలలో పలువురు దర్శించుకుని మొక్కుబడులు, చెల్లించుకుని వారపోత, తుళ్లిబిళ్ల, కావిడి కోళ్లు, గండాదీపం ఇక్కడ ప్రధానంగా మొక్కులు తీర్చుకుంటారు.సాధారణంగా చంటిపిల్లలో వచ్చే ఆటలమ్మ, పొంగు వంటి వ్యాధులు అమ్మవారి ఆగ్రహం వల్ల వస్తాయని, అందువల్ల ఈవ్యాధి సోకిన చంటిపిల్లలచేత ఈ మొక్కులు తీరుస్తుంటారు. అలాగే ఈ వ్యాధులు రానివారు అమ్మవారి అనుగ్రహం ఉందని మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. దీంతో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు చింతలూరు తరలి వస్తుంటారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రావులపాలెం, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం డిపోల నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులను నడుపుతారు. జాతర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ చెప్పారు. జాతర సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని స్థానికులు దీనికి సహకరించాలని వారు కోరారు.



చింతలూరు నూకాబింక అమ్మవారు





పునర్నిర్మాణం తరువాత ఆలయం, జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పూలగరగ

# మలబార్ ట్రస్టు దాతృత్వం

● ఇంటర్ విద్యార్థినులకు రూ.24 లక్షల స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు, మలబార్ సంస్థ డైరెక్టర్ హిషాం మహమ్మద్ ఆలీ, తదితరులు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మలబార్ ట్రస్టు ద్వారా ఇంటర్మీడియేట్ బాలికలకు రూ. 24 లక్షల స్కాలర్‌షిప్‌ల అందజేశారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ప్రముఖ వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం, మలబార్ నేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం గా మంగళవారం స్థానిక శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణంలో ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 246 మంది బాలికలకు రూ. 24 లక్షల స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలబార్ సంస్థ సామాజిక సేవా తత్పరతను కొనియాడారు. సంస్థ డైరెక్టర్ హిషాం మొహమ్మద్ ఆలీ మాట్లాడుతూ మలబార్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళా సాధికారత కోసం ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 95 వేల మందికి పైబడి రూ. 60 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందజేసిందన్నారు. బాలికల విద్యపై దృష్టి సారించడం ద్వారా, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, భావితరాల సామాజిక, ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్నామన్నారు. అసి స్టెంట్ మార్కెటింట్ మేనేజర్ అయ్యప్పస్వామి, సేల్స్ టీం నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'కోకో'కు గిట్టుబాటు ధర కల్పించాల్సిందే

● కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
● ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేత



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కోకో రైతులు

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద గల కోకో గింజలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలని కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కోకో రైతులు ఆందోళన చేశారు. అనంతరం ఆర్డీవో డా. రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలరోజులుగా కోకో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధర తగ్గించి రైతులను నిలువునా మోసగిస్తున్నాయన్నారు. అన్ సీజన్ సాకుతో గింజలను కొనుగోలు చేయకపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకోకు ధర ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికీ నష్టపోయిన రైతులకు ఇక ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతులు మరింత నష్టపోతారన్నారు. గత నెలలో కిలో గింజలు రూ. 650 ఉంటే ప్రస్తుతం రూ. 500లకు తగ్గించి రైతులను ఇబ్బందులకు గురి చేశారని, అన్ సీజన్ పేరుతో రూ. 200 నుంచి రూ. 240లకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. కోకో గింజలతో పచ్చళ్లు పెట్టుకోండి అంటూ రైతులను హేళన చేస్తున్నారన్నారు. కోకో గింజలకు రూ. 900 మద్దతు ధర కల్పించకపోతే రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని అమలు చేయాలన్నారు. విదేశీ కోకో గింజల దిగుమతిని నిలుపుదల చేయాలన్నారు. ఉద్యానశాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు, ఉండవల్లి కృష్ణారావు, గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, సుభాష్ చంద్రబోస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర బాబు, ఆలపాటి శ్రీధర్, సంగీత నాగరాజు, ఆకుల మోహనరావు, బిక్కిన కృష్ణ, జీ. శ్రీమన్నారాయణ, ఎంవీవీ సత్యనారాయణ, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● శ్రమదానంలో నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



శ్రమదానం చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో వీసీ పాల్గొని విద్యార్థులతో కలిసి ఇటుకలు మోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ మన ప్రాంగణం అనే భావనతో ముందుకు సాగాలన్నారు. వర్శిటీ విద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నన్నయ ప్రాంగణంలోని బ్యాంకు పక్కన వాహనాల పార్కింగ్‌కు ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచే కార్యక్రమం విద్యార్థులు చేపట్టారు. వీసీ విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సిమ్మెంట్ ఇటుకలు మోశారు. వీసీ స్వయంగా శ్రమదానం చేస్తుండడంతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, యూనియన్ బ్యాంకు మేనేజర్ కూడా శ్రమదానంలో పాల్గొన్నారు.

# వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 2024 జనవరి 21వ తేదీన కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆ నోటిఫికేషన్‌కు సంబంధించిన రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ జిల్లాలకు సంబంధించిన ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో తమపేర్లను పరిశీలించుకోవాలని కోరారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 27, 28 తేదీల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో లిఖిత పూర్వకంగా తమ అభ్యంతరాలు సమర్పించాలన్నారు. ఈనెల 28 వ తేదీ సాయంత్రం 4 గంటల తరువాత వచ్చిన ఎటువంటి అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను పరిగణించబోమని స్పష్టం చేశారు.

# కొమ్మ..కొమ్మకు.. గుత్తులు..గుత్తులు

● చెట్టు మొదళ్లనే విరగకాసిన మామిడికాయలు

సామర్లకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మామిడికాయలు అంటే చిటారు కొమ్మలకు కాస్తాయి అనేది అందరికీ తెలిసిందే. సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఒక పొలంలో మామిడిచెట్టు లావుగా ఉన్న మొదలు కొమ్మలకు ఎటువంటి ఆకులు లేకుండా గుత్తులు గుత్తులుగా మామిడికాయలు కాసి ఆ దారిన పోతున్న పలువురిని ఆకర్షిస్తున్నాయి. బంగినపల్లి రకానికి చెందిన ఈ మామిడికాయలు ఏడాది విడిచి ఏడాది ఈ రీతిలో చెట్టు మొదలు కొమ్మలకు గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తాయని రైతు వెంకన్నబాపు చెప్పారు.





సామర్లకోటలో మామిడి చెట్టు మొదళ్లకే కాసిన మామిడికాయలు



# అమ్మా నేను మోసపోయా..

● ఫార్మ్‌డీ ఫైనలియర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
● రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేనిలో ఘటన
● ఆసుపత్రి కోఆర్డినేటర్ దీపక్ వేధింపులే కారణమని ఆరోపణ



విద్యార్థి అంజలి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమ్మా నా గురించి బెంగపెట్టుకో వద్దు.. నేను దారుణం గా మోసపోయా..ఒక ఫంక్షన్‌కి రెడ్ కలర్ శారీ కట్టుకుని వెళ్లి వాడికళ్లలో పడ్డా..ఆ ఫంక్షన్‌కి రెడ్ కలర్ శారీ కట్టుకుని వెళ్లకుండా ఉండాల్సింది. అలా చేసి ఉంటే ఈ రోజు సంతోషంగా ఉండేదానిని.. వాడు తనను మోసం చేశాడని.. తనకు మరణం తప్పవేరే దారి కనిపించడం లేదు.. నా కోసం ఆలోచించవద్దు..చెల్లికి మంచి వ్యక్తిని చూసి పెళ్లి చేయండి.. తాను మరణించాక తన అవయవాలను దానం చేయాలని.. తన చెల్లికి తాను మళ్లీ పాపగా పుడతానని ఒక వైద్య విద్యార్థిని డైరీలో రాసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వికాస్ ఫార్మసీ కళాశాల ఫార్మ్‌డి ఫైనలియర్ విద్యార్థిని నల్లపు అంజలి (23) ఆత్మహత్యాయత్నం తీవ్రసంచలనం కలిగించింది. తోటి విద్యార్థినులను కదిలిచింది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మం డలం రౌతు గూడెం గ్రామానికి చెందిన అంజలి రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి వద్ద వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మ్ డి ఫైనలియర్ చదువుతుంది. గత ఆరునెలలుగా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తుంది. ఇదిలా ఉండగా ఈ నెల 23న ఆసుపత్రిలో అంజలి ఎనస్థీషియా అత్యధిక డోస్ ఇంజక్షన్ చేసుకుని కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమెతో కలిసి పనిచేసే సహచర సిబ్బంది గమనించి వెంటనే ఐసీయూలోకి తరలించి వైద్యం అందించారు. అయితే పరిస్థితి విషమించినా విషయం బయటకు రాకుండా ఆసుపత్రి వర్గాలు జాగ్రత్తపడ్డాయి. అయితే ఆమె డైరీలో రాసుకున్న సూసైడ్ లెటర్ బయటకు రావడంతో అంజలి తల్లిదండ్రులు, బంధువుల, కళాశాల విద్యార్థినులు, విద్యార్థి సంఘాలు మంగళవారం రాజమహేంద్రవరంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. బొల్లినేని ఆసుపత్రిని ముట్టడించి ధర్నా చేశాయి. అంజలి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మెడికల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తు న్న దీపక్ ఆమెను వేధించి అవసరాలు తీర్చుకుని ఇదే విషయాన్ని మరికొంత మందికి చెప్పి వేధింపులకు గురిచేయ డంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె రాసిన లేఖలో కూడా తాను అనుభవించిన దారుణ సంఘటనలు వివరించింది. సంఘటన స్థలాన్ని ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు రమేష్ బాబు, భవ్యకిషోర్ పర్యవేక్షించారు. అంజలి తండ్రి నల్లపు దుర్గారావు ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించం

● ఎమ్మెల్యేలు బత్తుల, ఆదిరెడ్డి

విషయం తెలుసుకున్న రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు ఆసుపత్రికి చేరుకుని అంజలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు.ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం అంజలి తల్లి,చెల్లిని పరామర్శించారు.ఈ ఘటనకు కారణమైన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని.. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు.అంజలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తొలుత ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు మాజీ ఎంపీ భరత్‌రామ్ మద్దతుగా నిలిచారు.



కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

# జీ.మేడపాడు ఎత్తిపోతల పథకం అక్రమాలపై విచారణ

● రైతుల నుంచి వాంగ్మూలాలు సేకరణ



సామర్లకోటలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

సామర్లకోట, మార్చి25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జీ.మేడపాడు ఎత్తిపోతల పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకుని రైతులనుంచి సేకరించిన సొమ్ములు స్వాహాకు గురవుతున్నాయని, సంస్థ అధ్యక్షుడు ఎత్తిపోతల పథకాన్ని తన సొంత ఆస్తిలా వాడుకుంటున్నాడని ఆయకట్టు రైతులు జిల్లా అధికారులకు చేసిన ఫిర్యాదుతో మంగళవారం సామర్లకోట తహశీల్దార్ కార్యా లయంలో సమగ్రవిచారణ నిర్వహించారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, కోపరేటివ్ రిజిస్ట్రార్ శివకామేశ్వరరావు ఈ విచారణలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల తరపున తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీరభద్రనారాయణ, ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు పాలకుర్తి చినబాబు, మద్దిపాటి ప్రకాష్, గోలి తమ్మిరాజు, పుట్టా రాంబాబు, తదితర రైతులు పాల్గొని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి ముందు తాము ఎదుర్కొంటున్న సమస్యలు అక్రమాలపై ఎలుగెత్తారు. ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు కాకుండా అనధికార ఆయకట్టుకు రెండు పంటలకూ సాగునీరు సమృద్ధిగా అందిస్తూ ఏటా లక్షలాది రూపాయలు అక్రమ వసూళ్లు చేస్తున్నారన్నారు. వాస్తవ ఆయకట్టులో ఇద్దరి రైతులకు చెందిన సుమారు 90 ఎకరాలు ఆయకట్టు ఉండగా వాటికి అసలు నీరివ్వకుండా అక్రమంగా మరో 100 ఎకరాలకు సాగునీరందిస్తున్నట్లు రికార్డులలో టాంపరింగ్ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రెజర్‌వాల్స్ ఓపెన్‌చేస్తూ నీటిని అక్రమంగా మళ్లిస్తూ వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. నీటి యాజమాన్యం, నిధుల స్వాహా, ఆయకట్టు కమిటీ ఎన్నికలు నిర్వహించకపోవడం వంటి అంశాలతో సొంత ప్రైవేట్ కంపెనీగా అక్రమంగా వాడుకుంటూ ఏటా లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నాడని పలువురు ఫిర్యాదుదారులు తహశీల్దార్, కోపరేటివ్ రిజిస్ట్రార్ ఎదుట వివరించారు. ఎత్తిపోతల పథకం నిర్వహణలో ఐడీసీ అధికారులు, కోపరేటివ్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ ఆ రెండు శాఖల అధికారులు మౌనం దాల్చడంతో కమిటీ అధ్యక్షుడు అక్రమాలకు పాల్పడేందుకు దోహదపడిందని శ్రీనుబాబు అధికారుల ఎదుట ఆరోపించారు. ఈ విచారణలో ఎత్తిపోతల పథక ఆయకట్టుదారుల సంఘ అధ్యక్షుడు ఆచంట రాజబాబు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామివారి అధ్యయనోత్సవాలు

● గరుడవాహనంపై విహరించిన శ్రీవారు

ఆత్రేయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే గోదావరి నదీజల సంగ్రహణ కార్యక్రమం మేళతాళ మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాలు అందించారు. అధ్యయనోత్సవాలలో భాగంగా పల్లకి మహోత్సవం, శ్రీవారు గరుడవాహనంపై ఆసీనులై వీధుల్లో విహరించారు. మేళతాళ మంగళ వాయిద్యాలు వేదమంత్రాలు, కేరళవాయిద్యాలతో అధ్యయనోత్సవాలు శోభయమానంగా ని ర్వహించారు.స్వామివారి కల్యాణోత్సవాలకు ముందుగా ఈఉత్సవాలను నిర్వహిస్తారు. ఐదు రోజులపాటు అధ్యయనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు.



శ్రీ వేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలలో భాగంగా గరుడవాహన గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వాడపల్లి అధ్యయనోత్సవాలలో భాగంగా ద్రవిడ వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

# అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆదాయం
# రూ.26,48,813


ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న అధికారులు, భక్తులు, సిబ్బంది

అంతర్వేది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో మంగళవారం తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.25,86,985, గుర్రాలక్కమ్మ హుండీ రూ.20, 676, అన్నదాన హుండీ రూ.41,152 మొత్తం హుండీల ద్వారా 39 రోజులకుగాను రూ.26,48,813 ఆదాయం వచ్చినట్టు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో
# భక్తులకు ఏసీ గదుల నిలుపుదల

### ఉన్నతాధికారులు వివరణ కోరడంతో పునరుద్ధరణ

అన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో నీటి కొరత కారణంగా ఈవో సుబ్బారావు ఆదేశాలతో భక్తులకు ఏసీ గదులను సోమవారం రాత్రి నుంచి సీఆర్వో కార్యాలయంలో కేటాయింపును నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయం దీనిపై ఉన్నతాధికారులు వివరణ కోరడంతో గదుల కేటాయింపు పునరుద్ధరించారు. పంపా రిజర్వాయర్‌లో అడుగంటిపోయిన భూగర్భనిల్వలు నేపథ్యంలో సత్యగిరి కొండపైకి నీటి సరఫరా సరిగా జరగడం లేదు. సత్యగిరి కొండపై శివసదన్ కాటేజీలో 138, హరిహరసదన్ కాటేజీలో సుమారు 80 గదులు ఉన్నాయి. రత్నగిరి కొండపై ప్రకాష్‌సదన్ కాటేజీలో 84 ఏసీ గదులుండగా వేసవి నేపథ్యంలో భక్తులు ఏసీ గదులు తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఒక్కసారిగా ఏసీ గదుల కేటాయింపు నిలుపుదల నేపథ్యంలో భక్తుల నుంచి విమర్శలు రావడం, వివిధ ప్రసార మాధ్యమాల్లో దావానంలా వ్యాపించడంతో కాకినాడ జిల్లా కలెక్టర్, దేవదాయశాఖ కమిషనర్ వివరణ కోరడంతో గదుల కేటాయింపు పునరుద్ధరించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన
# ఎస్‌ఐ, డ్రైవర్‌కు 14రోజుల రిమాండ్

పిఠాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్‌ఐ ఎల్.గుణశేఖర్, ప్రవేటు డ్రైవర్ నల్లా శివలకు 14రోజులు పాటు రిమాండ్ విధిస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజులను 2024 అక్టోబరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పించేందుకు ఎస్‌ఐ రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ లంచం తీసుకుంటుండగా రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్‌తో పాటు అతను వినియోగించే పోలీసు జీపు ప్రవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లా శివను ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దాడి చేసి పట్టుకున్న సంగతి తెలిసిందే. వారిని రాజమహేంద్రవరం ఏసీబీ కార్యాలయంలో మంగళవారం విచారించారు. రాత్రి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా ఏప్రిల్ 18వ తేదీ వరకూ జడ్జి రిమాండ్ విధించారు. అరెస్టు అనంతరం ఎస్‌ఐ వద్ద ఉన్న మొబైల్స్‌తో పాటు ప్రవేటు డ్రైవర్ వద్ద ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో కేసులకు సంబంధించిన కొన్ని రికార్డులు తమతో తీసుకెళ్లినట్టు సమాచారం.

**లావాదేవీలపై ఆరా...**

పిఠాపురం రూరల్ ఎస్‌ఐ, ప్రవేటు డ్రైవర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అందులో ఫోన్‌కాల్స్, వాట్సాప్ మెసేజీలు, ఫోన్‌పే, జీ పే లావాదేవీలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఎస్ ఐ నుంచి ఫోన్‌పే ద్వారా ఒక పోలీసు ఉన్నతాధికారి వద్ద పనిచేస్తూ ఎస్సీఎస్టీ కేసులు చూసే సిబ్బంది ఒకరికి పంపిన నగదు విషయాన్ని గుర్తించి దానిపై ఆరా తీస్తున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నట్టు చెబుతున్నారు. ఎస్‌ఐ ఏసీబీకి చిక్కడంతో కాకినాడ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులందరూ అలర్టయ్యారు. ప్రవేటు వ్యక్తులను పోలీసుస్టేషన్లకు రావద్దని చెప్పడం గమనార్హం.

# కంటైనర్‌లో మందు సీసాల పట్టివేత

### కంటైనర్ సీజ్, డ్రైవర్ అరెస్ట్

ముమ్మిడివరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బుకింగ్ సరుకు రవాణా చేస్తున్న కంటైనర్‌లో యానాం నాన్‌డ్యూటీపెయిడ్ మందు సీసాలను రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌కు చెందిన అమెజాన్ సంస్థకు చెందిన ఆన్‌లైన్‌లో బుక్ చేసిన సరుకును కంటైనర్‌లో తీసుకువెళ్తూ కాకినాడలో కొంత సరుకును దింపి అమలాపురం తరలించే క్రమంలో ఆ కంటైనర్ డ్రైవర్ నల్గొండకు చెందిన కొంద్రు వేణు యానాంలో ఆరు బీరు బాటి టీన్నులు, రెండు లీటర్ల విస్కీ బాటిళ్లను కొనుగోలు చేసి వస్తున్నాడు. ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డాడు. కంటైనర్‌ను, డ్రైవర్‌ను కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు ముమ్మిడివరం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ వారిస్తున్నా వినకుండా కంటైనర్ డ్రైవర్ వేణు అమలాపురం వైపు పోనిచ్చాడు. దారిలో 2 లీటర్ల విస్కీ బాటిళ్లను ధ్వంసం చేశాడు. దీంతో ఎక్సైజ్ సిబ్బంది చేజ్ చేసి కంటైనర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌కు తరలించారు. కంటైనర్‌ను సీజ్ చేసి కంటైనర్ డ్రైవర్ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అదనపు కట్నం కోసం వేధింపులు
## భర్తతో సహా పలువురిపై కేసు

గొల్లప్రోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మహిళను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తతో సహా పలువురిపై గొల్లప్రోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీకి చెందిన కోలా సునీతకు నాలుగు సంవత్సరాల క్రితం పిఠాపురం మండలం నవఖండ్రవాడకు చెందిన ఆనంద ప్రసాద్‌తో వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. పెళ్లి సమయంలో రూ.4.50లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చినా కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త ఆనందప్రసాద్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్టు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడికి తల్లి, ఆడపడుచు, ఆమె భర్త, అతడి మేనమామ, భార్యలు ఆనందప్రసాద్‌కు మద్దతు ఇచ్చి వేధింపులకు గురిచేస్తున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై వరకట్నం వేధింపులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

## జాబ్‌మేళాలో
## 131మంది ఎంపిక

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో 2రోజులపాటు జరిగిన జాబ్‌మేళాలో 131 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టింగ్ సర్వీస్ కంపెనీలో వారు కంటెంట్ ఎనాలిస్ట్‌లుగా పనిచేస్తారు. మొత్తం 1440 అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. మొత్తం 350 మంది అభ్యర్థులను ఎంపిక చేయాలని వర్చుసా ప్రతినిధులు ప్రకటించినప్పటికీ ఇంగ్లీషు భాషపై పట్టులేకపోవడం వల్ల కేవలం 131 మంది మాత్రమే ఉద్యోగాలు పొందారు. అయితే ఇంటర్వ్యూలో ఫెయిల్ అయ్యిన అభ్యర్థులు ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ తీసుకుని వచ్చే నెల మరోసారి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆయన అభినందనలు తెలిపారు.

## ఏజెన్సీలో ముమ్మరంగా
## వాహనాల తనిఖీ

మోతుగూడెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతివాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో చింతూరు మండలంలో మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణ, సిబ్బంది, సీఆర్పీఎఫ్ ఏ పార్టీ టు బెటాలియన్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు సోదాలు చేశారు. ఇతర ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ట్రైనింగ్ ఎస్‌ఐలు సీతారాం, చంటి తదితరులు పాల్గొన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శివ నారాయణ, పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్‌పి 42 బెటాలియన్ ట్రైనింగ్ ఎస్‌ఐలు

## రోడ్డు ప్రమాదంలో
# పాస్టర్ ప్రవీణ్ మృతి

### బుల్లెట్‌పై వెళ్తుండగా గామన్ వంతెన వద్ద ఘటన


పాస్టర్ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)


ఘటనా స్థలం వద్ద ప్రవీణ్‌కుమార్ మృతదేహం

రాజానగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గామన్ బ్రిడ్జి రహదారిపై కొంతమూరు నయారా పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. హైదరాబాద్ తిరుమలగిరి సమీపంలోని ఎస్‌టీఎహెచ్ కాలనీకి చెందిన పగడాల ప్రవీణ్‌కుమార్(46) అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకుడిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వెనుక లగేజీ బ్యాగ్ కట్టుకుని సోమవారం రాత్రి రాజమహేంద్రవరం బయలుదేరారు. రాజమహేంద్రవరంలో స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని, భార్యకు చెప్పి బుల్లెట్‌పై బయలుదేరినట్టు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మార్గమధ్యలో సోమవారం అర్ధరాత్రి కొంతమూరు సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి మోటార్‌సైకిల్ అదుపుతప్పి రహదారి నుంచి పల్లపు ప్రాంతానికి పడిపోవడంతో మోటార్ సైకిల్ ప్రవీణ్‌కుమార్‌పై పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మర్నాడు ఉదయం వరకు ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం తమకు వచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించామని, బుల్లెట్‌తో సహా ప్రవీణ్‌కుమార్ రహదారి పైనుంచి కిందికి జారిపోవడం, బుల్లెట్ ఆయనపై పడిపోవడంతో మృతిచెందినట్టు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఎస్‌ఐ మనోహర్ కేసు నమోదు చేశారు.

## పాస్టర్ మృతిపై క్రైస్తవ సంఘాల నాయకుల ఆగ్రహం

### రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధన ఆసుపత్రి ఎదుట నిరసన, ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్రైస్తవ సువార్తికుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మంగళవారం తెల్లవారుజామున కొంతమూరు-ఆటోనగర్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటనపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, పలువురు మతపెద్దలు, రాజకీయ నాయకులు భగ్గుమన్నారు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, పాస్టర్ ప్రవీణ్‌ను ఆయన వ్యతిరేకులు ఎవరో చంపేశారని అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. రెండు, మూడు గంటలపాటు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ధర్నాను తాత్కాలికంగా విరమింప చేశారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీ హర్షకుమార్, రాజేష్ మహాసేనతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలు, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పాస్టర్లు జాన్ వెస్లీ, జేమ్స్, విజయరాజు వంటి వారితోపాటు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవసంఘ నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందలేదనే అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఈ విషయంలో నిష్పాక్షికమైన దర్యాప్తు చేయాలని కోరారు. కాగా అంతకుముందు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో ఉంచిన ప్రవీణ్ మృతదేహాన్ని పలువురు సందర్శించారు.


రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద మాజీ ఎంపీ హర్షకుమార్, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

### ప్రవీణ్ మృతిపై
## ఐదు ప్రత్యేక విచారణ బృందాలు : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై కొందరు అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ సంఘటనపై విచారణకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పోలీస్ బృందాలు పారదర్శకంగా, ఎటువంటి డివియేషన్స్ లేకుండా కేసును సరైన పద్ధతిలో విచారణ చేస్తున్నాయన్నారు. ఇతరుల మనోభావాలు, మానాభిమానాలు దెబ్బతినేలా, కుల,మత రాజకీయవర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా, మతపరమైన, సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఉన్నాయని, గుర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

# ముళ్ల కంచెలో ముక్కుపచ్చలారని పసిబిడ్డ

- పోతవరంలో అమానుషం
- కుక్కలు పీక్కు తింటుండగా అడ్డుకున్న రైతులు
- ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స, పరిస్థితి విషమం


కుక్కలు తినేసిన శిశువు తలభాగం


పోతవరం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో మంగళవారం అమానుష ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోతవరం- యర్నగూడెం రోడ్డులో పొగాకు బ్యారన్స్ దగ్గర ఉన్న ముళ్లపొదల్లో ముక్కుపచ్చలారని ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు. ఉదయం పాలు తీసుకురావాడానికి అటుగా వెళ్తున్న రైతులు శిశువును కుక్కలు పీక్కుతినడం చూసి వాటి నుంచి శిశువును కాపాడి వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఏఎన్ఎం మహాలక్ష్మి,గ్రామ సంరక్షణ అధికారి దీపక సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న శిశువును తీసుకుని వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ శిశువును పరిశీలించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిశువుకు డీఎస్ ఏ పరీక్షలు నిర్వహించి రక్తం ఎక్కించారు. నల్లజర్ల సీఐ వై.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లిన సీఐ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సీడీపీవో నాగలక్ష్మి, ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఏలూరు వెళ్లి శిశువును పరిశీలించి సంరక్షణ కోసం ఇద్దరి ఆయాలను అక్కడ ఉంచారు. మరో 48 గంటలు దాటితే తప్ప ఆరోగ్య పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపినట్టు సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు. ముక్కుపచ్చలారని పసిబిడ్డను ముళ్ల కంచెలో విసిరి వేయడానికి మనసు ఎలా వచ్చిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పోతవరంలో ఇతర ప్రాంతాల నుంచి పొగాకు పనులు చేసుకునేవారు వందల సంఖ్యలో ఉంటారని, వారే గుట్టుచప్పుడు కాకుండా శిశువును విసిరి వేసి ఉంటారని గ్రామస్థులు భావిస్తున్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి


రాంబాబు(ఫైల్)

జగ్గంపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో సిగిరెడ్డి రాంబాబు(59) మృతిచెందాడు. వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన సిగిరెడ్డి రాంబాబు రామవరం హైవేలో ఉన్న లారీ యూనియన్ ఆఫీసుకి బైక్‌పై వెళ్తుండగా రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న రాంబాబు రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురానికి తరలించినట్టు ఎస్‌ఐ రఘునాధరావు తెలిపారు.

## బస్సు, బైక్ ఢీ

### ఇద్దరికి గాయాలు


ప్రమాద స్థలం వద్ద క్షతగాత్రులు

పెద్దాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల బస్సు, మోటార్ సైకిల్ ఢీకొనగా ఇద్దరు గాయపడిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండల పరిధిలోని కాండ్రకోట గ్రామంలో మంగళవారం జరిగింది. సామర్లకోట కేఎస్ఎన్ పాఠశాలకు చెందిన బస్సు కాండ్రకోట మర్లావ రహదారి మధ్యలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన కంచుమర్తి వెంకటేష్, చీటీడి అమ్మన్న గాయాలపాలయ్యారు. చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ వి.మౌనిక తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

# నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

- తాత వరసైన వ్యక్తి ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఎటపాక, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అభం, శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా తాత వరసైన వ్యక్తి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట పంచాయతీ పరిధిలో జరిగింది. ఈనెల17న ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారిని ఎదురింట్లో ఉండే తాత వరసైన వ్యక్తి మడకం చిట్టిబాబు (42) చేయి పట్టుకుని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. చిన్నారిపై అఘాయిత్యం చేసి బయటకు తీసుకువచ్చాడు. ఆరోజు రాత్రి చిన్నారి నొప్పిగా ఉందని, జరిగిన విషయం తల్లికి చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు న్యాయం చేయాలంటూ కులపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కులపెద్దల సమక్షంలో న్యాయం జరగకపోవడంతో మంగళవారం బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఇరుగు,పొరుగువారిని విచారించారు. అత్యాచారం జరిపిన ఇంటి ప్రాంతాన్ని పరిశీలించారు. వైద్యపరీక్షల నిమిత్తం చిన్నారిని చింతూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

## మహిళ స్నానం చేస్తుండగా వీడియోలు తీసి
# కోరిక తీర్చాలంటూ వేధింపులు

### ఇద్దరిని అరెస్ట్ చేసిన అనపర్తి పోలీసులు

అనపర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళ స్నానం చేస్తుండగా చాటుగా వీడియోలు చిత్రీకరించి ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తూ కోరిక తీర్చాలంటూ వేధించడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు. వివరాల ప్రకారం..తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరా రామచంద్రపురానికి చెందిన నల్లమిల్లి మణికంఠరెడ్డి(అయ్యప్ప), కర్రి రామకృష్ణారెడ్డి అదే గ్రామానికి చెందిన మహిళ స్నానం చేస్తుండగా వీడియో చిత్రీకరించారు. సంఘటన జరిగి సుమారు నాలుగు నెలలు గడచింది. నాటి నుంచి మహిళకు ఆ వీడియోలు చూపి రూ.లక్ష ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అయితే తాను డబ్బులు ఇవ్వలేనని బయటకు తెలిస్తే పరువుపోతుందని బ్రతిమాలుతూ వస్తుంది. చివరకు రూ.4వేలు ఇచ్చిన ఆమె ఇక డబ్బులు ఇవ్వలేనని, వీడియోలు డిలీట్ చేయాలని ప్రాధేయపడింది. తమ కోరిక తీరిస్తే వీడియోలు డిలీట్ చేస్తామని లేకుంటే సోషల్ మీడియాలో పెడతామని వారిద్దరు బెదిరించారు. చివరకు ఆమె వారి వేధింపులు తాళలేక విషయాన్ని భర్తకు చెప్పి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

# తప్పిన పెను ప్రమాదం

### అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయిన స్కూల్ బస్సు
### 40 మంది పిల్లలు సురక్షితం


కె.కొత్తూరు శివారున పంట పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు

జగ్గంపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించిన స్కూల్ బస్సు జగ్గంపేట మండలం కె.కొత్తూరు గ్రామ శివారున అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. స్కూలు ముగిసిన తరువాత పిల్లలను ఇంటికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో బస్సులో 40 మంది పిల్లలు ఉన్నారు. పక్కనే ఉన్న విద్యుత్ స్థంబాన్ని ఢీకొని పొలాల్లోకి వెళ్లి ఆగింది. విద్యుత్ వైర్లు పక్కకు ఒరిగి అలా ఉండిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పిల్లలను బస్సులోంచి దించి వెంటనే వేరే బస్సులో వారి గమ్య స్థానాలకు చేర్చారు. గడ్డి బండి అకస్మాత్తుగా రావడంతో బస్సు అదుపు తప్పినట్టు డ్రైవర్ తెలిపాడు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

### రెండురోజుల తర్వాత మృతదేహం లభ్యం


చెరువులో వీర పురుషోత్తం మృతదేహం

గొల్లప్రోలు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని చెరువులో పడి వ్యక్తి మరణించగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన సలాది వీర పురుషోత్తం (37) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 23వ తేదీన బహిర్భూమికి గానూ పెద(కోటలంక వారి)చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి అతడి కోసం గాలిస్తుండగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటనపై గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వడ్రంగి మృతి


మరణించిన ఏసురత్నం

కడియం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వడ్రంగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన ఐసెట్టి ఏసురత్నం (49) ఈనెల 24న కడియపుసావరంలో ఎస్.సత్తిబాబు ఇంటికి వడ్రంగి పని నిమిత్తం వెళ్లి సాయంత్రం పనిచేస్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. విషయాన్ని ఏసురత్నం కుమారుడికి తెలియపరిచారు. వెంటనే కడియం ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మంగళవారం ఏసురత్నం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

## చెట్టు మీద నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతిచెందిన బంగారునాయుడు

తునిరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చెట్టు మీద నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం వి. కొత్తూరులో జరిగింది. వి.కొత్తూరు గ్రామానికి చెందిన రైతు బోజంకి బంగారు నాయుడు (41) తన పొలంలో చింత చెట్టు ఎక్కి చింతకాయలు తెంచే క్రమంలో కాలు జారి కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక మత్స్యకారుడి ఆత్మహత్య

కరప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన కొప్పనాతి గంగాధరరావు(65) చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గంగాధరరావు మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. అయితే దీనిపై ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సునీత చెప్పారు.

### నవోదయకు శాంతినికేతన్ విద్యార్థి

ఐ.పోలవరం,మార్చి25(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నవోదయ విశ్వవిద్యాలయానికి మురమళ్ల శాంతి నికేతన్ విద్యార్థిని నూలు అనన్య ఎంపికైనట్టు కరస్పాండెంట్ గోకవరపు వెంకట్రాజు తెలిపారు. కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ వీరభద్రకుమారి, హెచ్ఎం రెడ్డి శ్రీనివాస్‌లు అనన్యను అభినందించారు.

### నాణ్యతతో సీసీ రోడ్లు నిర్మించాలి

అంబాజీపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్లను నాణ్యత ప్రమాణాలతో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మించాలని ఎంపీడీవో జీవీ సరోవరరావు సూచించారు. చిరతపూడిలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు.

## అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

- తాగునీటి సరఫరాపై సభ్యుల ఆందోళన
- వాకౌట్ చేసిన మాల ప్రజాప్రతినిధులు



తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ ఏడుకొండలు

ఉప్పలగుప్తం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒక సారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు ముఖం చాటేస్తే, మేము సమస్యలపై ఎవరిని ప్రశ్నించాలంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన శాఖల అధికారులు సైతం రాకుంటే సమావేశాలెందుకని ఎంపీడీవోను నిలదీశారు. ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు అధ్యక్షతన మంగళవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఉద్యాన, ఎక్సైజ్‌తో సహా పలు శాఖల అధికారులు సమావేశానికి రాలేదు. దీనిపై ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్‌ను చినగాడవిల్లి సర్పంచ్ బద్రి బాబ్జి నిలదీశారు. ఎన్నో సార్లు ఇలా జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నెల రోజుల్లో మళ్లీ సర్వసభ్యసమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణాలు పూర్తయిన వాటర్ ట్యాంకులను ఎందుకు ప్రారంభించడం లేదని సర్పంచ్ కుంచే బుల్లియ్య ప్రశ్నకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడమే కారణమని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సురేష్ బదులిచ్చారు. విలసవిల్లిలో వాటర్ ట్యాంకు సకాలంలో శుభ్రం చేయడం లేదని ఎంపీటీసీ సలాది సురేఖావాణి అన్నారు. గోపవరం పంచాయతీ బెస్తావారిపేటకు తాగునీరందడం లేదని ఎంపీటీసీ కొంకి ఏడుకొండలు ఆందోళన వ్యక్తం చేశారు. హౌసింగ్ దరఖాస్తులు కూటమి నాయకులకు ఇవ్వాలా? హౌసింగ్ అధికారులకు ఇవ్వాలా అని వైసీపీ సభ్యులు హౌసింగ్ ఏఈని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో అందరికీ అవకాశం కల్పించామని, ఇప్పుడు అధికార పార్టీ పెత్తనం జరుగుతోందని వైసీపీకి చెందిన బద్రి బాబ్జి, కొంకి ఏడుకొండలు వ్యాఖ్యానించారు. మీ పార్టీ పాలనలో అసలు హౌసింగ్ రుణాలే ఇవ్వలేదంటూ టీడీపీకి చెందిన సర్పంచ్‌లు నల్లా బాబండి, చిక్కం జంగమయ్య ఎదురుదాడి చెయ్యడంతో వైసీపీ సభ్యులు మౌనం వహించారు. సొంత భూమి కల్గిన రైతులందరూ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతు సేవాకేంద్రాల ద్వారా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు విజ్ఞప్తి చేశారు. కొంకి ఏడుకొండలు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ సమావేశం చివరలో జడ్పీటీసీ గెడ్డం సంపదరావుతో పాటు మాల ప్రజాప్రతినిధులందరూ వాకౌట్ చేశారు.

## ప్రజాప్రతినిధి అడిగిన సమస్య పునరావృతం కాకూడదు

**మండలపరిషత్ సర్వసభ్య సమావేశం**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఒక సమావేశంలో ప్రజాప్రతినిధి అడిగిన సమస్యను మళ్లీ సమావేశంలో పునారావృతం కాకుండా చూసుకోవల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచిం చారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్య పరిష్కారం మీవల్ల కాకపోతే నాదృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. వేసవిలో తాగునీటికి ఎద్దడి రాకుండా ప్రత్యే ప్రణా ళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధి కారులను కోరారు. డ్రైన్స్ విషయంలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సమస్యలను నాదృష్టికి తీసుకురావాలని కోరారు. రెండో పంట చివరిలో ఉందని, రైతులకు ఇబ్బందులు లేకుండా శివా రు ప్రాంతాలకు సాగునీరందే విధంగా చూడా లని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం ఇప్పటికే నియోజకవర్గంలో పల్లెపండు గలో భాగంగా రూ.15కోట్లు నిధులు ఖర్చు చేశా మన్నారు. మళ్లీ మరో రూ.8కోట్లు నిధులు మం జూరయ్యాయన్నారు. ప్రధాన రహదారుల అభి వృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రజల తరుపున సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జరిగిన శాఖల వారి సమీక్షలో లో-హోల్టేజ్ సమస్యలను, ఇళ్ల స్థలాల కేటాయింపు, హౌసింగ్ రుణాలు మంజూరు తదితర సమస్యను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. భూములరీసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవి కోరారు. ముంగండ, పాశర్లపూడి తాగు నీటి ప్రాజెక్టులకు జనరేటర్లు మంజూరయ్యాని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణచక్రవర్తి తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఎంపీటీసీల సమైఖ్య అధ్యక్షురాలు కొక్కిరి లక్ష్మి పాల్గొన్నారు.

**సర్పంచ్‌ల భర్తలకు మాట్లాడే అర్హత లేదు:** సమావేశం జరుగుతుండగా ఒక సర్పంచ్ భర్త సమస్యను చెప్పే ప్రయత్నం చేశారు. మేం సమస్యలు చెప్పలేకపోతున్నామని అందుకే మా భర్త మాట్లాడారని సర్పంచ్ సమర్థించారు. మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు మాత్రమే మాట్లాడే అర్హత ఉందని ఎంపీడీవో కేవీ ప్రసాద్ స్పష్టం చేశారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తీరుపై ఉద్యోగుల నిరసన

**27న కౌన్సిల్‌లో నిరసనకు నిర్ణయం**

అమలాపురం టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి భర్త సత్యనారాయణ వ్యవహార శైలిపై మున్సిపల్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల27న జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులంతా నిరసన తెలిపేందుకు మంగళవారం జరిగిన సమావేశంలో తీర్మానించారు. చైర్‌పర్సన్ భర్త సత్యనారాయణ అన్నీ తానై పాలనా వ్యవహారాలు వ్యవహరిస్తున్న తీరుకు ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలం క్రితం మున్సిపల్ ఉద్యోగి మృతిచెందడంతో వారి కుటుంబంలోని ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇచ్చేందుకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ఆ వ్యవహారంలో చైర్‌పర్సన్ భర్త అనుచితంగా వ్యవహరించడాన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో తన మాట కాదని ఒక ఉద్యోగి నోట్‌ఫైల్ తయారు చేయడంపై భర్త సత్యనారాయణ మండిపడినట్టు సమాచారం. ఏది ఏమైనా సత్యనారాయణ వ్యవహారశైలిని నిరసిస్తూ మున్సిపల్ ఆర్వో శ్రీలక్ష్మీ, బాలాజీ తదితరులు సమావేశం నిర్వహించి కౌన్సిల్ సమావేశం రోజున నిరసన తెలిపేందుకు నిర్ణయించారు. ఇదిలా ఉండగా చైర్‌పర్సన్ భర్త అధికారపక్ష, వైసీపీ కౌన్సిలర్ల పట్ల కూడా అనుచితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల నిరసన తీవ్రతను బట్టి పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు అవసరమైతే వైసీపీ తరపున అవిశ్వాసం ప్రవేశపెట్టనున్నట్లు ఆ పార్టీ కౌన్సిలర్లు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

### నీటిసంఘ సర్వసభ్య సమావేశం

రాజోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాటిపాక ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం పొన్నమండ నీటిసంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో కాల్వ నీరు సక్రమంగా పారుదల జరిగేందుకు, కాల్వలు బాగు చేయించడానికి నిధులు కేటాయించేందుకు ఇరిగేషన్ ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. కాల్వకు అవసరమైన చోట, గండ్లు పడినచోట గోడల నిర్మాణం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో తాటిపాక ఏఈఈ సుందర్‌సింగ్, ఐసీ అసిస్టెంట్ శ్రీనివాస్, పొన్నమండ నీటిసంఘం ఉపాధ్యక్షుడు చేగొంగి త్రిమూర్తులు, డైరెక్టర్లు కడలి వెంకటేశ్వరరావు (అబ్బు), ఉండ్ర జ్యోతిప్రసాద్, సాగి పావయ్యరాజు, ముత్యాల శ్రీనివాసరావు, అల్లు సత్యనారాయణ, పున్నం రామకృష్ణ, అడబాల సత్యప్రసాదరావు, అప్పారి రామకృష్ణ, అడబాల శ్రీనివాసరావు, కైలా సూరిబాబు పాల్గొన్నారు.

### విజయవాడ దుర్గ గుడికి సైకిల్ యాత్ర

ఐ.పోలవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో బుచ్చిబాబు ఎమ్మెల్యేగా గెలిస్తే విజయవాడ దుర్గమ్మ ఆలయానికి సైకిల్‌పై వస్తానని ఐ.పోలవరానికి చెందిన టీడీపీ వీరాభిమాని పితాని అచ్చిబాబు మొక్కుకున్నాడు. మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద అచ్చిబాబు సైకిల్ యాత్రను ఎమ్మెల్యే బుచ్చిబాబు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తుల సాయి, క్లస్టర్ ఇన్‌చార్జి సాగిరాజు సూరిబాబురాజు, మద్దిరెడ్డి కుమార్, వినోద్‌రాజు, కట్టా సత్తిబాబు, బొంతు ప్రసాద్, గుత్తుల సుబ్బారావు, మేడిశెట్టి నాని, వాసంశెట్టి పోలరాజు, మట్టపర్తి వెంకట్రావు, విధులూరి కాళహస్తి, ప్రత్తి నాగబాబు, బొలిశెట్టి రాజు, ఇళ్ళ ప్రసాద్, వాసంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

అంబాజీపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని ఏపీడీ డి.రాంబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవరరావు అధ్యక్షతన ఉపాధి హామీ మేట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే ప్రాంతంలో వర్క్ వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో అడపా వెంకటకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

### వినాయకుడి గుడిలో చోరీ

అల్లవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోడితిప్ప పంచాయతీ పరిధి గోపాయిలంక ఏటిగట్టు ఉన్న వినాయకుని గుడిలో సోమవారం రాత్రి తాళాలు బద్దలుగొట్టి దొంగలు హుండీలోని సొమ్మును చోరీచేశారు. రూ.15వేల సొమ్ము దొంగతనానికి గురైనట్టుగుర్తించి గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. మాకిరెడ్డి సత్తిబాబు, చిట్నీడి శ్రీనివాస్, కొల్లాటి అయ్యప్పనాయుడు, కొల్లాటి శ్రీరాములు, కుడుపూడి శ్రీను తదితరులు అల్లవరం ఎస్ఐను కలిసి గుడిలో హుండీ చోరీపై వివరించారు. దీంతో ఎస్ఐ తిరుమలరావు వినాయక ఆలయాన్ని మంగళవారం రాత్రి పరిశీలించారు.

### వివాహ నిర్వహణ నిధులు మంజూరు

యానాం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యానాంలో కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వివాహ నిర్వహణ నిధులు మంజూరయ్యాయని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. వీరిలో వధువుల వివాహ నిర్వహణ ఆర్థిక సహాయం 495 మంది, వితంతువుల కుమార్తె వివాహ ఖర్చులకు సంబంధించి 127మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. 2018నుంచి ఈనిధులు పెండింగ్ ఉన్నాయన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జయ అయిందన్నారు. అదేవిధంగా ఆది ద్రావిడ సంక్షేమ పథకం ద్వారా గృహాలు నిర్మించుకునేందుకు నగదు రూ.7లక్షల వరకు పెంచుతున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారని, ఇకపై నూతనంగా గృహ నిర్మాణం చేసుకునే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.7లక్షలు ఇవ్వనున్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అమలాపురంటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై అలామపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అమలాపురం సుబ్బారాయుడు చెరువుగట్టు ప్రాంతానికి చెందిన 37ఏళ్లవివాహితకు 17ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. భర్త పట్టించుకోకపోవడం వల్లే తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు మంగళవారం తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ ఎస్ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తుల ఆందోళనతో ఉద్రిక్తత



టెర్మినల్ రోడ్డులో మహిళలు, గ్రామస్తుల ధర్నా

అల్లవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 30ఏళ్లగా చమురు ఉత్పత్తులను తరలించుకుపోతూ ఓడలరేవు గ్రామాభివృద్ధి, స్థానికులకు ఉపాధి అవకాశాలు పట్ల ఓఎన్జీసీ అధికారులు అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ మంగళవారం గ్రామస్తులు, మహిళలు ఓడలరేవు టెర్మినల్ రోడ్డులో బైఠాయించి పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, టీడీపీ, జనసేన నాయకులు ధర్నాస్థలికి చేరుకుని గ్రామస్తుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ తిరుమలరావు సంఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఓడలరేవు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ రోడ్డుపై బైఠాయించి వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈనేపథ్యంలో గ్రామస్తుల ఆందోళనను అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు దృష్టికి సత్తిబాబురాజు తీసుకువెళ్లారు. ఓఎన్జీసీ ఉన్నతాధికారి వర్షునై, జనరల్ మేనేజర్ రవినాయక్‌లు ఓడలరేవు టెర్మినల్ వద్ద ఆందోళనకారులతో మాట్లాడారు. రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, డైరెక్టర్ దెందుకూరి సమక్షంలో ఓఎన్జీసీ అధికారులు ఈనెల27న గ్రామస్తులతో చర్చలకు అంగీకరిస్తూ లేఖలు సమర్పించారు. కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, గుండుమేను శ్రీనివాస్, పెచ్చెట్టి రామకృష్ణ, కామాడి గంగాభవానీ, కొల్లు శుభకీర్తి, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపీరాజు, జనసేన నాయకులు గ్రామస్తుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఓఎన్జీసీ అధికారులలేఖ, సీఐ ప్రశాంత్‌కుమార్‌ల హామీలతో 23వ రోజు ఆందోళన విరమించారు.

## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం.. ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే ఆనందరావును అభినందిస్తున్న మహిళలు

అమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బండారులంక మురుగులమ్మ గుడిపుంత సెంటర్ నుంచి బ్రాహ్మణవీధి మీదుగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.20లక్షలతో డ్రైన్ నిర్మాణానికి మంగళవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. దశాబ్దాల కాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి చొరవ చూపి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకున్న ఎమ్మెల్యే ఆనందరావును వార్డు మెంబరు కొండా కుమారి ఆధ్వర్యంలో మహిళలు సత్కరించారు. తొలుత టీడీపీ సభ్యుడైన లక్కింశెట్టి సత్యనారాయణమూర్తి ఇటీవల మృతిచెందగా టీడీపీ కేంద్ర అధిష్టానం రూ.5లక్షలు పార్టీ తరపున అందించగా సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ వాసునాయక్ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ మండల కార్యదర్శి మంద గెద్దయ్య, గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు బళ్ల వెంకటేశ్వరరావు, కాసిన బాబి, ఏకుల విజయ్, గుమ్మిడి సత్తిబాబు, కడించర్ల శ్రీను, ఏకుల విజయ్, యాళ్ల కుమార్, మాడా పద్మదుర్గాప్రసాద్, బళ్ల శ్రీనివాసచక్రవరి పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి దిగుమర్తి తత్వషణ్ముక్ పేరుతో రూ.లక్ష విరాళాన్ని కాకినాడకు చెందిన దిగుమర్తి శ్రీపద్మావతి, శ్రీనివాస్‌లు మంగళవారం సహాయ కమిషనర్‌కు అందజేశారు.

### గోడిలంకలో రీసర్వే గ్రామసభ

అల్లవరం, మార్చి25(ఆంధ్రజ్యోతి):భూయజమానులు, రైతులు తమవద్దనున్న దస్తావేజులు, పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకువచ్చి రీసర్వేకు సహకరించాలని ఆర్డీవో కె.మాధవి అన్నారు. గోడిలంక పంచాయతీ వద్ద రీసర్వే గ్రామసభలో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. గోడిలంక, మొగళ్లమూరు గ్రామాల్లో రీసర్వేగ్రామసభలు జరిగాయి. తహశీల్దార్ ఎంవీవీఎల్ నరసింహం, గ్రామ సర్పంచ్‌లు రుద్రరాజు పవిత్రాలక్ష్మీపతిరాజు, రాయుడు విష్ణుత్రిమూర్తులు, డిప్యూటీ తహశీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోడూరి మన్యం, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం

అల్లవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం శ్రీసత్యసాయి సేవాసదన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం ద్వారా 300మందికి వైద్య సేవలు అందించారు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో జనసేన నాయకులు నల్లా రాము, పిండి గణపయ్య, పిండి సురేష్‌ల సహకారంతో ప్రజలకు వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ వైద్యులు డాక్టర్ సుశీల, డాక్టర్ లివింగ్‌స్టన్, డాక్టర్ గునిశెట్టి వెంకట్, డాక్టర్ తోట మౌనిక, భవితారాణి, మెడికల్ ఇన్‌చార్జి ధర్మప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 25మందిని క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనసేన నాయకులు గుర్రం కృష్ణ, కటికిరెడ్డి బాబి, నార్ని అమ్మాజీ, యర్రంశెట్టి నాగేశ్వరరావు, బుంగ మధు, ఆచంట నాగరాజు, టీడీపీ నాయకులు పరసా కిరణ్, మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపీరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆక్వా జోన్ గ్రామసభలు

కాట్రేనికోన, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు, కాట్రేనికోన, ఉప్పూడివ, చిర్రయానాం గ్రామాల్లో ఆక్వా జోన్ గ్రామ సభలు నిర్వహించినట్టు మత్స్యశాఖ అధికారి తెలిపారు. గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన ఈసభల్లో తహశీల్దార్, వ్యవసాయాధికారి, ఇరిగేషన్ అధికారి, భూగర్భశాఖ అధికారి, వీఆర్వోలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామకార్యదర్శులు, ఆక్వా రైతులు పాల్గొన్నట్టు తెలిపారు.

### ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలి

అంతర్వేది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలతో పాటు రైతులకు ఇచ్చే సబ్సిడీ పథకాలను కూడా రైతులు సకాలంలో వినియోగించుకోవాలని ఏవో వీవీ నరసింహారావు అన్నారు. రైతులతో కలిసి కొబ్బరి తోటల్లో కొబ్బరిలో వచ్చే తెగుళ్లపై రైతులకు పలు సూచనలు అందించారు. అనంతరం అంతర్వేది గ్రామ పంచాయతీ వద్ద రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు సాగుచేసే సేద్యపు భూమిని ఉప్పునీటి బారిన పడకుండా రైతులు కాపాడుకోవాలని, దానికి మావంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాబూరావు, దాసరి వాసు, కొల్లు మహాలక్ష్మి, దొండపాటి నరసింహమూర్తి, కల్యాణ్, తేజ, కొల్లాబత్తుల ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

### పొలాలను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ

ఉప్పలగుప్తం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అయినాపురం సెక్షన్ పరిధిలోని లక్ష్మీవాడ- వాడపర్రు, ఉప్పలగుప్తం- పేరాయిచెరువు ఆయకట్టు శివారు పొలాలను ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ మంగళవారం పరిశీలించారు. శివారులో పంటకాల్వలు అడుగంటిన పరిస్థితిని ఎస్ఈ గమనించారు. పది రోజుల పాటు కాల్వలకు సాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన నీటి సంఘాల చైర్మన్లకు చెప్పారు. ఎక్కడైనా సమస్య ఎదురైతే తక్షణం తనకు ఫోన్ చెయ్యాలని సూచించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాస్, ఏఈ పవన్, ఉప్పలగుప్తం డీసీ దంగేటి చిట్టిబాబు, నీటి సంఘాల అధ్యక్షులు నల్లా సత్యనారాయణ, మోటూరి రవికుమార్, గుత్తుల శ్రీనివాస్, పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

### రీసర్వేపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం: ఆర్డీవో

మామిడికుదురు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అమలాపురం ఆర్డీవో కె.మాధవి పేర్కొన్నారు. రీసర్వే గ్రామసభ బి.దొడ్డవరం గ్రామంలో మంగళవారం జరిగింది. ఈసభలో ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రీసర్వే గురించి ప్రజలకు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమానికి భూ యజమానులు సహాయ సహకారాలు అందించి తమ తమ ఇబ్బందులను సమస్యలను తొలగించుకోవాలని కోరారు. ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది లేకుండా కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులు, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, సర్పంచ్ సీహెచ్ శివరామసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, మండల సర్వేయర్ వాణి, వీఆర్వో అప్పన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### కాలనీవాసులకు సామాజిక స్థలాన్ని కేటాయించాలి

అమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పేరూరు చంద్రబాబునాయుడు కాలనీలోని సామాజికస్థలాన్ని కాలనీవాసుల అవసరాలకు మాత్రమే కేటాయించాలని డిమాండ్‌చేస్తూ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. 1995లో చంద్రబాబు ప్రభుత్వంలో 2.50 ఎకరాల స్థలంలో 66మందికి ఇళ్లస్థల పట్టాలు ఇచ్చారని కాలనీకి చెందిన మోటుపల్లి సత్యవేణి వివరించారు. జాతీయ రహదారి అభివృద్ధి చెందడంతో అక్కడకు సమీపంలో ఉన్న కాలనీలో భూముల ధరలు పెరిగిపోయాయని, తాము సామాజిక భవనాన్ని కాలనీలో కాకుండా ఎక్కడా నిర్మించుకునే పరిస్థితి లేదన్నారు. అధికారులు న్యాయంచేసి కమ్యూనిటీ స్థలాన్ని కాలనీవాసులకు కేటాయించాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిట్టూరి జ్యోతి, కె.శ్రీలక్ష్మి, సామంతకుర్తి పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

### విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యుల నియామకం

అమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా ముగ్గురిని నియమిస్తూ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. అమలాపురం మండలం బండారులంకకు చెందిన జంగా బాబూరావు, అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన కొంకి రాజామణి, ఇరుసుమండకు చెందిన మోకాటి నాగేశ్వరరావును కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అమలాపురం మండలం నడిపూడిలోని బాబూజగ్జీవన్‌రామ్ సంఘ కార్యాలయం వద్ద కాప నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మోకాటి నాగేశ్వరరావుకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంతో పాటు ఎన్నో దళిత ఉద్యమాల్లో పాల్గొన్న నాగేశ్వరరావు సేవలను వక్తలు కొనియాడారు. కార్యదర్శి చాట్ల సత్యనారాయణ, డైరెక్టర్లు తొత్తరమూడి ప్రభాకరరావు, మంద వెంకటేశ్వరరావు, ఉందుర్తి సత్యనారాయణ, మోకాటి అమ్మిరాజు, నూటుకుర్తి మూర్తి, కొడమంచిలి సాయికుమార్, కాప నారాయణరావు, మోకాటి రమేష్ పాల్గొన్నారు.

### 'ఇచ్చిన హామీలు వదిలేశారు'

ముమ్మిడివరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్సమట్ల ఉద్యభాస్కరవర్మ ఆరోపించారు. ఎన్నికల సమయంలో సూపర్-6 పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాజధాని విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

### భక్తులతో కిక్కిరిసిన వేంకటేశ్వరాలయం

అయినవిల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామంలో గల శ్రీఅలివేలుమంగా, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మంగళవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

### భూసర్వేపై అవగాహన పెంచుకోవాలి

మలికిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భూసర్వేతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తహశీల్దార్ టి.శ్రీనివాసరావు అన్నారు. విశ్వేశ్వరాయపురంలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ సీహెచ్ హెలీన, సర్వేయర్ మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనుల పరిశీలన

ముమ్మిడివరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గాడిలంకలో రూ.కోటితో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరిశీలించారు. సీసీ రోడ్డు పనులతో పాటు అండర్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట గుత్తుల సాయి, మహాదశ లక్ష్మీనారాయణ, బసవా దయాశివాజీ, కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు, పెద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, మహాదశ గంగాధరరామారావు, నల్లా వేణుగోపాలరావు, మహాదశ ఆంజనేయులు, మహాదశ గణేశ్వరరావు, కొమ్మిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### యువగళం దంపతులకు ఐకాన్ అవార్డు



పి.గన్నవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అఖండ శంఖారావ యువగళం దంపతులు, రాష్ట్ర ప్రత్యేక దళం రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులకు టీబీఆర్ ఐకాన్-2025 అవార్డు లభించింది. ఉగాది పురస్కరించుకుని ఆదివారం హైదరాబాదులో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపట్ల వెంకటాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు, రాజకీయ నాయకుడు బాలిరెడ్డి పృథ్వీరాజ్ నుంచి వారు అవార్డును అందుకున్నారు. శంఖారావ కళను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నందుకు అవార్డు లభించిందని పలువురు వక్తలు కొనియాడారు. అవార్డు అందుకున్న దంపతులకు పలువురు అభినందనలు తెలిపారు.

### సారా రహిత గ్రామాలకు నవోదయ 2.0

అమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవోదయ 2.0 కార్యక్రమాన్ని చేపట్టిందని అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం కామనగరువు, రెడ్డిపల్లి, తాండవపల్లి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. నాటుసారా తాగడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. నాటుసారా తయారుచేసినా, విక్రయించినా, సరఫరా చేసినా సమాచారం అందించాలని కోరారు. ఎక్సైజ్ ఎస్ఐ పి.బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు. మద్యం విక్రయిస్తున్న మాచవరానికి చెందిన టి.సుబ్రహ్మణ్యం, బండారులంకకు చెందిన దొమ్మేటి గోపాలకృష్ణలను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండు విధించినట్టు సీఐ తెలిపారు.

### పంటకాల్వలోకి కాలువ నీరు మళ్లింపు

ముమ్మిడివరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మగాం-అయినాపురం పంట కాల్వ పరిధిలో కాల్వ శివారు భూములకు నీటి ఎద్దడి సంభవించడంతో తాగునీటి సంఘం ఆధ్వర్యంలో మురుగుకాల్వలోని నీటిని పంటకాల్వలోకి ఆయిల్ ఇంజిన్ల సాయంతో మళ్లిస్తున్నారు. ఈపంటకాల్వ పరిధిలోని ముమ్మిడివరం, సూరాయిచెరువు, సోమిదేవరపాలెం, అయినాపురం గ్రామాల్లో వరి పొలాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. వరి పొలాలు ఈనిక, గింజలు పాలు పోసుకునే దశలో ఉన్నాయి. నీటి ఎద్దడిపై రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో నీటి సంఘం ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు మురుగుకాల్వలోని నీటిని పంటకాల్వలోకి తోడుతున్నారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్ సమీపంలో రెండు బోర్లు నుంచి నీటిని కాల్వలోకి మళ్లిస్తుండగా సోమిదేవరపాలెం వద్ద మురుగుకాల్వలోని నీటిని ఐదు కృషి ట్రాక్టర్లతో కాల్వలోకి మళ్లిస్తున్నారు. అయినాపురం వద్ద కూడా మురుగుకాల్వలో నీటిని పంటకాల్వలోకి మళ్లించేందుకు మూడు కృషి ట్రాక్టర్లు ఏర్పాటుచేశారు. దీంతో కాల్వ శివారు వరి పొలాలకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారమైంది.

### దళితుల హక్కుల కోసం పాటుపడాలి

మలికిపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దళితుల హక్కుల కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కామ్రేడ్ జేవీ ప్రభాకర్ అన్నారు. మంగళవారం రామరాజులంకలో అంబేడ్కర్ స్మృవనంలో దళితహక్కుల పోరాట సమితి మహాసభ జరిగింది. కామ్రేడ్ జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నిమ్నజాతులు ఎన్నో అవమానాలకు గురయ్యారని, నేటికీ దళితులకు కులవివక్ష తప్పడం లేదని, అగ్రవర్ణాలు దాడులకు గురవుతున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందినప్పటికీ దళితులపై వివక్షత ఏమాత్రం పోలేదన్నారు. ప్రతీ ఒక్కరు దళితులకు న్యాయం జరిగే వరకు ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో దేవ రాజేంద్రప్రసాద్, ఇసుకపట్ల రఘుబాబు, కామ్రేడ్ కె.సత్తిబాబు, గోసంగి బోసుబాబు, సర్పంచ్ కాకర శ్రీనివాస్, బత్తుల లక్ష్మణరావు, గెడ్డం తులసీభాస్కర్, నల్లి శివకుమార్, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, తోటే ప్రతాప్ పాల్గొన్నారు.

### బీసీ అభ్యున్నతికి కృషి: బాబ్జి

మలికిపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సాధికార సమైక్య అధ్యక్షుడిగా గుబ్బల బాబ్జిని నియమిస్తూ రాష్ట్ర కార్యవర్గం నియామక పత్రాలు అందజేశారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని బాబ్జి అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.జయప్రకాష్‌నారాయణ నుంచి మంగళవారం నియామక పత్రాలను ఆయన అందుకున్నారు. పలువురు బాబ్జిని అభినందించారు.

### 35మందికి ఉద్యోగాలు

రాజోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సారథ్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. కిమ్స్, కేఎల్ గ్రూపు, పేటీఎం సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 75మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 35మంది ఎంపికయ్యారని డీపీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్డీవో శ్రీహరిశేషు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, డాక్టర్ బోస్, పీఆర్వో ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

### గోగన్నమఠంలో అగ్నిప్రమాదం

మామిడికుదురు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పట్టా ఆదియ్యకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం పరామర్శించారు. జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. కట్టుబట్టలతో మిగిలామని, తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. స్థానిక నాయకులు సమకూర్చిన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి కమిటీ కృషి చేయాలి

మామిడికుదురు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాశ్లమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆకాంక్షించారు. ఈదరాడలోని శ్రీపాశ్లమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన సాధనాల సుబ్బారావును పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, నాయకులు దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, అడపా వెంకటరత్నం, కాట్రేనిపాడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



బాలలు రచించిన కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో శ్రీకర్

## పుస్తక పఠనం బాలల్లో జ్ఞాపకశక్తికి దోహదం

**కొత్తపేట ఆర్డీవో శ్రీకర్**

ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా చిన్నారుల్లో మేధాశక్తి పెరుగుతుందని వక్తలన్నారు. మంగళవారం గోదావరి బాలల కథల పుస్తకాన్ని చింతలూరు నూకాంబిక ఆలయ ప్రాంగణంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆవిష్కరించారు. బాలల కథలు పుస్తకాన్ని ప్రచురించిన బాలమందిరం వ్యవస్థాపకుడు కృష్ణశ్రీని ఆర్డీవోతో పాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ అశోక్, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో రాజు, ఆలయ ఈవో వీర్రాజుచౌదరి, ఎంఈవో అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కర్లమ్మ అమ్మవారి జాతర



బడుగువానిలంకలో కర్లమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం బడుగువానిలంకలోని భూముల్లో ఉండే గ్రామదేవత కర్లమ్మ జాతరను సోమవారం రాత్రి ఘనంగా జరిపారు. లంక భూముల మధ్యలో ఉండే అమ్మవారికి ప్రతి రెండేళ్ల ఒకసారి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. గ్రామంలోని పాత, కొత్త ఊరు విడివిడిగా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఇటీవల పాత ఊరులో జాతర నిర్వహించగా సోమవారం రాత్రి కొత్తూరులో జాతర జరిపారు. ఉత్సవ కమిటీ అధ్వర్యంలో గరగనృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మ వారి ఉత్సవాలకు లంక గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ అధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.





పసలపూడిలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు. పక్క చిత్రంలో సాయి సత్యవ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

## పసలపూడిలో ఘనంగా సాయి సత్యవ్రతాలు

రాయవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయి సత్యవ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన అర్చకులు దేవులపల్లి ప్రసాద్, వెలవలపల్లి ఆంజనేయులు అర్చకత్వంలో షిర్డీసాయినాథునికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన జరిపారు. అనంతరం భక్తులతో సామూహిక సాయి సత్యవ్రతాలు జరిపించగా గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.11లక్షలు

ఆత్రేయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,11,586 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

**సినీనటుడు చంద్రకాంత్ పూజలు:** వాడపల్లి వేంకటేశ్వరస్వామిని మంగళవారం రాత్రి సినీ నటుడు చంద్రకాంత్ దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలుకగా, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపింది. మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్ చైర్మన్ మోటుపల్లి బాపిరాజు, పాలకవర్గ సభ్యులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. నూతన పాలకవర్గ చైర్మన్‌గా రామకృష్ణతోపాటు ఇతర పాలకవర్గ సభ్యులుగా తమకు చోటు కల్పించిన నేపథ్యంలో ఆయన్ను వారు సత్కరించారు. ఆయనకు వేంకటేశ్వరస్వామి చిత్రపటం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్, కూటమి నాయకులు సత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న దృశ్యం

## సోమేశ్వరం హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

రాయవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న రాగి జావను ఆయన పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులను పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం దయామణి, సమగ్రశిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

### సిద్దిరెడ్డి మృతికి సంతాపం

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన కాపు సంఘనేత సిద్దిరెడ్డి సూర్యారావు(86) మంగళవారం అస్తమించారు. కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు వున్నారు. సూర్యారావు మృతిపట్ల రాష్ట్ర కాంగ్రెస్‌నేత కామన ప్రభాకరరావు, పట్టణ కాపు సంఘ నాయకులు జిన్నూరి సాయిబాబా, శెట్టి నాగేశ్వరరావు, ఎం.బాపిరాజు, కర్రి రామారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, జి.తాతరాజు, గంగుమళ్ల శ్రీను, ఆదిమూలం అబ్బులనాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

## పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి

కె.గంగవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ చోడే గోవిందరాజు, ఎంపీటీసీ కడలి సత్యసూర్యకుమారి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పంచాయతీ ఆవరణలో సభ నిర్వహించారు. తడి, పొడి చెత్తలు విడిగా సేకరించడానికి నీలం, పచ్చ రంగు డస్ట్‌బీన్‌లను పంపిణీ చేశారు. పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణకు వచ్చిన సమయంలో ప్రజలు తడి, పొడి చెత్తలను అయా డస్ట్‌బీన్‌లలో వేసి సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జెమ్మీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గోవిందరాజు

## గృహ ప్రవేశం చేయకుంటే రద్దుకు వెనకాడం

### టిడ్కో లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ రంగారావు వినతి

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపుంతలో నిర్మించిన టిడ్కో గృహాల ఫేజ్ 1లో తొలి విడతగా 2,568 మందికి ప్లాట్లను అప్పగించామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మెప్మా సిబ్బందితో ఆయన టిడ్కో గృహాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇప్పటి వరకు గృహప్రవేశం చేయని వారి ఇళ్లను రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని లబ్ధిదారులను ఆయన హెచ్చరించారు. స్వాధీనం చేసుకోని లబ్ధిదారులను సచివాలయ సిబ్బంది గుర్తించి వారితో తక్షణమే గృహ ప్రవేశాలు చేయించి ఇళ్లను అప్పగించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం రాయితీని ఇచ్చిందని తెలిపారు. ప్రజలు నిర్ణీత నెలాఖరుకల్లా ఇంటి, ఆస్తి పన్నులు చెల్లించి రాయి తీని పొందాలని ఆయన కోరారు. సమావేశం లో మున్సిపల్ డీఈఈ కె.శ్రీనివాస్, ఏఈలు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, మెప్మా సీఎంఎం, సుజాత, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాలపై సమీక్షిస్తున్న కమిషనర్ రంగారావు

### భర్త అదృశ్యంపై ఫిర్యాదు

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఒక మహిళ భర్త కనిపించడం లేదంటూ మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని సైదులోపేటకు చెందిన కోసూరి సత్యవతి భర్త నరసింహమూర్తి ఈనెల 10న అప్పు తీసుకుని వస్తానని ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు రాలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. భర్త కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ జి.చిన్నారావు తెలిపారు.

### బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శిగా దుర్గాప్రసాద్



ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శిగా చింతలూరు ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వాసా నాగవీర దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం సారథ్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా నాయకులు గుబ్బల మురళీకృష్ణ, సుబ్బరాజు, పల్లంరాజు, మండల శాఖ అధ్యక్షులు బొంతు లోకేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు ఆయన్ను అభినందించారు.



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

### ఘనంగా వెంకన్న జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న వైభవ వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు కె.బాలబాలాజీ అచార్యులు ఆధ్వర్యంలో పలువురు ఋత్వికులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు, అభిషేకాలు, కలశపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నీటి యాజమాన్య పద్ధతులు పాటించండి

కె.గంగవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నీటి యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయశాఖ అధికార బలుసు రవి అన్నారు. మంగళవారం పామర్రు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచన లు చేశారు. రాయితీపై పెసలు, మినుములు విత్తనాలు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రసాయిన ఎరువులను ఎక్కువ మోతాదులో వాడితే భూసారం కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ గణేష్, కూటమి నాయకులు నున్న బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### హెల్మెట్ల పంపిణీ

కొత్తపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోనసీమ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. దీనికి ముఖ్య అతిధిగా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పాల్గొని మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం రైతులకు గ్యాస్ డెలివరీ బాయ్స్, నర్సులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు ఎస్.ఆదిత్యకిరణ్, ఓనం రాజు, పట్నాల రమణ, గుర్రం రామకృష్ణ, టీఎస్ఎన్ రెడ్డి, తమ్మన సాయిప్రసాద్, గమిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

ద్రాక్షారామ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం మూడవ వార్డులో తడి, పొడి చెత్తలపై మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ సెక్రటరీ సరిత తడి, పొడి చెత్తలను విడదీసి పారిశుధ్య సిబ్బంది అందించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

## నూకాంబిక ఉత్సవాలపై ఆర్డీవో సమీక్ష

ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. మంగళవారం అమ్మవారి ఉత్సవాలపై ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్‌లో మంచినీటి సదుపాయాలు, చంటి పిల్లలకు పాలు అందించే ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరికి సూచించారు. పోలీసు బందోబస్తు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, ఆర్టీసీ సర్వీసులపై ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో శ్రీకర్ చర్చించారు. సమావేంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, ఎస్‌ఐ ఎం.అశోక్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉత్సవాలపై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆర్డీవోతో పాటు పలువురు అధికారులు ఆవిష్కరించారు.



చింతలూరు నూకాంబికను దర్శించుకున్న ఆర్డీవోతోపాటు అధికారులు

## ఉత్తమ సేవలకు గుర్తింపు తథ్యం

రాయవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలే ఎల్లప్పుడూ గుర్తింపునిస్తాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రాయవరం ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న పడాల సత్యనారాయణరెడ్డి సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా అధికారి షేక్ సలీంబాషా మాట్లాడారు. అనంతరం సత్యనారాయణరెడ్డి, అరుణ కుమారి దంపతులను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్‌ల సమాఖ్య మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పడాల వెంకటరామరెడ్డి(రాము), రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ తదితరులతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



హిందీ ఉపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తదితరులు

## అంగన్‌వాడి కేంద్రాల్లో కార్పొరేట్ విద్యాబోధన

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాల్లో కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వ కార్యాచరణ సిద్ధమైందని స్త్రీ శిశుసంక్షేమశాఖ జిల్లా పీడీ శాంతికుమారి చెప్పారు. మండపేటలో మంగళవారం గౌతమి మున్సిపల్ పాఠశాలలో జరిగిన పోషణ భీ, పడాయి భీ పథకంపై అంగన్‌వాడీ నిర్వాహకులకు శిక్షణ జరిగింది. మూడురోజులపాటు జరిగే శిక్షణలో అమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీపీవో గజలక్ష్మి అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ శాంతి కుమారి, సీడీపీవో గజలక్ష్మి మాట్లాడారు. శిక్షణ తరగతుల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ పద్మావతి కుమారి, సత్యవేణి, నాగశ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్త్రీ శిశుసంక్షేమశాఖ జిల్లా అధికారి శాంతికుమారి

## వేసవిలో రైతులు అపరాల సాగు చేపట్టాలి

రాయవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వేసవిలో రైతులు మూడవ పంటగా అపరాల సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ సూచించారు. సోమవారం రాయవరం రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీపై రైతులకు అపరాల పంపిణీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ వేసవిలో అపరాలను వేసుకోవడానికి ప్రభుత్వం 50 శాతం రాయితీపై వాటిని రైతులకు అందిస్తుందన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా రైతులకు అపరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, దేవిశెట్టి చిన్ని, వ్యవసాయ విస్తరణ అధికారి శివశంకర్, వ్యవసాయ సహాయకుడు మణికంఠ, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు అపరాలను అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

### సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తోడ్పాటు అందించాలి

ఆత్రేయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ వేముల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సారా తయారీ, విక్రయాలు మానుకుని ముందుకు వచ్చిన వారికి డీఆర్‌డీఏ ద్వారా రుణాలు అందించి ఆయా కుటుంబాలను ఆదుకుంటామన్నారు. తహశీల్ధారు రాజేశ్వరరావు మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్న వ్యక్తులు పట్టుబడితే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. సీఐ కాత్యాయని మాట్లాడుతూ 60 రోజులలో సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అందరి సహకారం అవసరమన్నారు. దత్తత అధికారి అన్నవరం సారాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం టోల్‌ఫ్రీ నెంబరు 14405 పోస్టర్‌ను ఈఎస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### అభ్యాసన కేంద్రాలుగా అంగన్‌వాడీలు సిద్ధంకావాలి

ద్రాక్షారామ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పిల్లల అభ్యసనా కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు తయారు కావాలని శిశుసంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారిణి శాంతి కుమారి అన్నారు. రామచంద్రపురం ప్రాజెక్టు పరిధిలో మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రాజెక్టు అధికారిణి వరాహలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బోధన చేసే విధానంపై తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

### అమ్మవారి గ్రామోత్సవం

కపిలేశ్వరపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో నూకాంబిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం జరిపారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. సోమవారం రాత్రి మోదుగపూలతో అమ్మవారి అలంకరించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొంటారని మంగళవారం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కార్యాలయం తెలిపింది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో వారు కోరారు.

### అసంఘటిత కార్మికులు ఈ శ్రమ్ పథకంలో నమోదు చేసుకోవాలి

**ఎమ్మెల్యే వేగుళ్ల**

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు ఈశ్రమ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పథకంలో 16 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులన్నారు. అర్హులైన అసంఘిటిత కార్మికులు అంతా ప్రమాదవశాత్తు మరణిస్తే 2లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ1లక్ష వంతున ఈ పథకం ద్వారా పొందవచ్చన్నారు. ఈనెల 31 లోపు నమోదు చేయించుకోవాలన్నారు.



ఆదరణ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రత్నకుమారి

### ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదరణ-3 పథకాన్ని సద్వినియోగం ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల కులాలకు ఆదరణ-3 పథకం ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆయా కులాల నాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో టీడీపీ సీనియర్ మండల నాయకుడు పుత్సల శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయం ఏవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆక్వాజోన్‌లో చేర్చాలి

మండపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇప్పనపాడు, తాపేశ్వరం, కేశవరం గ్రామాల్లో పంట పొలాలను రొయ్యల చెరువులుగా సాగు చేసుకునేందుకు వీలుగా ఆక్వాజోన్‌లో చేర్చాలంటూ పలువురు రైతులు మత్స్యశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పలు శాఖల ఆధ్వర్యంలో రైతులకు గ్రామ సభలను నిర్వహించారు. సమావేశంలో రైతులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. జిల్లాస్థాయి కమిటీకి ఈ నివేదికను పంపుతాని అధికారులు తెలిపారు. మండపేటలో 386 ఎకరాలను చెరువుల తవ్వకం కోసం అనుమతి కోరుతూ రైతులు దరఖాస్తు చేసుకున్నారు. తాపేశ్వరంలో 17.64 ఎకరాలు, ఇప్పనపాడులో 7.15 ఎకరాలు, కేశవరంలో 2.95 ఎకరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్, పంచాయతీల వద్ద గ్రామసభలు నిర్వహించి స్థానికుల అభ్యంతరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్యబాబు తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



పెద్ద ఆంజనేయస్వామి ఆలయంలో పారాయణలో పాల్గొన్న మహిళలు

### ఆంజనేయస్వామికి పూజలు

రావులపాలెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని పెద్ద ఆంజనేయస్వామి ఆలయంలో లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అంజనీసుత భజనా మండలి అధ్యక్షురాలు రాతికొండ లక్ష్మి సత్యవేణి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, కృష్ణుని పారాయణలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ పారాయణలు చేశారు. ఏప్రిల్ 15 నుంచి 17వ తేదీ వరకు ఉడిపిలో స్వామివార్ల కీర్తన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మన్యం సూర్యకుమారి, కనకలక్ష్మి, ధనలక్ష్మి, రమాదేవి, అనంతలక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

### కేశవస్వామి మాస కల్యాణం

ఆత్రేయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి మాస కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్దకు స్వామివారి తోడ్కొని వచ్చి కల్యాణం శోభయమానంగా నిర్వహించారు. అశేషభక్తజనం పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు.